# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 20-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:223 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

తూనికలకు కొలతలకును
మానితమగు స్థానమొసగి మన్నన జేయన్
రాణించిను జగతి యనుచు
జ్ఞానులు ప్రవచించినారు సంతస మొప్పన్

(మే 20 ప్రపంచ తూనికల కొలతల దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

కాళేశ్వరం కుంగుబాటు
కారణాలు తెలిసిపాయె
ఇంకనైనా బాగుచేయ
ఇష్టమేడ నిలిచిపోయే
గతంమీద తలపోస్తూ
గడిపేసుడే కాదు ఒప్పు
సాగునీటి సంక్షోభమే
సర్కారుకు పెద్ద ముప్పు



-వేల్పుల నారాయణ
9440433475

# నినాదాలను చట్టాలుగా తీసుకొస్తున్నాం

## -డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

మహబూబ్‌నగర్, మే 19:: తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న



దున్నేవానికి భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న జల్, జంగల్, జమీన్, భూమి కోసం, భుక్తి కోసం పోరాటం వంటి నినాదాలు చట్టాలుగా మారాలంటే రాష్ట్రంలో మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలి అన్నారు.

ఈరోజు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకువచ్చిన నల్లమల డిక్లరేషన్‌తో రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తాం అన్నారు. రాష్ట్ర ప్రజల పైన అపారమైన ప్రేమ తరతరాలుగా వెనుకబడ్డ బిడ్డలకు మేలు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనతో నల్లమల డిక్లరేషన్ ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఏమి పొందలేక దూరంగా ఉన్న గిరిజన బిడ్డలకు 12,600 కోట్లతో పథకాన్ని ప్రారంభించడం ఓ గొప్ప సాహసంగా డిప్యూటీ సీఎం అభివర్ణించారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా 1000 కోట్లు మంజూరు చేయబోతున్నట్టు ప్రకటించారు.

# పోడు భూములకు జలకళ

## - మంత్రి సీతక్క

మహబూబ్‌నగర్, మే 19:కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల కోసం తీసుకొచ్చిన 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించడం ఆనందంగా ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు పోడు పట్టాలు మంజూరైన నేపథ్యంలో బీడు వారుతున్న పోడు భూములకు జలకళను తెచ్చేందుకే సర్కార్ 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆదివాసీలు ప్రత్యేక గిరిజన చట్టాలను వినియోగించుకోవాలని, త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో మాదిరిగానే గిరిజన ప్రాంతాల వారికి ప్రత్యేక ఉద్యోగాలు అందించే ప్రయత్నం చేస్తామని మంత్రి సీతక్క చెప్పారు.

# సౌర విద్యుదుత్పత్తితో ఆదాయం - ఆదివాసుల అభివృద్ధే లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, మే 19:సౌర విద్యుత్‌తో ఆదివాసులు ఆదాయం మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమ్రాబాద్ ఇందిర సౌర గిరి జల వికాసం పథకంలో భాగంగా రైతులకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా ఇస్తామని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు 5, 7.5 హెచ్‌పీ పంపుసెట్లు ఇస్తామన్నారు.



### 'అచ్చంపేట'ను ఆదర్శంగా తీర్చిదద్దుతాం

అచ్చంపేటను మోడల్ నియోజకవర్గంగా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో వంద రోజుల్లో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యుత్ పంపుసెట్ల స్థానంలో వీటిని బిగిస్తారని, ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి గిరిజనులు ఆదాయం పొందాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### 6.63 లక్షల ఎకరాల పోటు పట్టాలు

రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద 6.63 లక్షల ఎకరాల విస్తీర్ణానికి (2.30 లక్షల మంది ఎస్టీ రైతులకు) పోడుపట్టాలు మంజూరయ్యాయి.

ఇందులో విద్యుత్తు సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే సమీప రైతులను కలిపి బోర్వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. ఈ నెల 25 వరకు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించి, జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన, భూగర్భ జలాల సర్వే తదితర పనుల్ని గిరిజన సంక్షేమశాఖ చేపడుతుంది. జూన్ 25 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు తదితర పనుల్ని పూర్తి చేస్తారు. తొలి ఏడాదికి 10 వేల మంది రైతులకు చెందిన 27.184 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేందుకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# భారత్ ధర్మసత్రం కాదు..శరణార్థులందరూ వెళ్లిపోవాల్సిందే : సుప్రీం కోర్టు

నల్గొండ, మే 19: "ప్రపంచంలోని శరణార్థులందరికీ ఆశ్రయం కల్పించడానికి భారతదేశం ఏమీ ధర్మసత్రం కాదు. ఇప్పటికే 140 కోట్ల జనాభాతో వేం ఇబ్బందులు పడుతున్నాం. విదేశీ పౌరులందరినీ చేర్చుకోవడానికి ఇది ధర్మశాల కాదు," అంటూ సుప్రీంకోర్టు ఓ శ్రీలంక జాతీయుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనకు ఆశ్రయం కల్పించాలంటూ సదరు వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ దేశంలో స్థిర నివాసం కల్పించాలనే హక్కు మీకెక్కడిదని ఘాటుగా ప్రశ్నించింది. జస్టిస్ దిపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

శ్రీలంకలో ఒకప్పుడు క్రియాశీలంగా ఉన్న లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2015లో సదరు శ్రీలంక జాతీయుడిని భారత్ లో అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద 2018లో ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధారించి, పదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, 2022లో మద్రాస్ హైకోర్టు ఈ శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్షాకాలం పూర్తయ్యాక దేశం విడిచి వెళ్లాలని, అప్పటివరకు శరణార్థుల శిబిరంలో ఉండాలని ఆదేశించింది.

దీంతో, ఆ శ్రీలంక తమిళ జాతీయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తనకు ప్రాణహాని ఉందని, తన భార్యాపిల్లలు ఇక్కడే స్థిరపడ్డారని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. శిక్ష పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా తనను ఇంకా నిర్బంధంలోనే ఉంచారని, దేశం నుంచి పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదని వాపోయాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ), ఆర్టికల్ 19 (ప్రాథమిక హక్కులు – వాక్ స్వాతంత్ర్యం, సంచార స్వేచ్ఛ వంటివి) కింద తమకు హక్కులున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు.

పిటిషనర్ వాదనలపై జస్టిస్ దత్తా తీవ్రంగా స్పందించారు. "భారత్ ధర్మసత్రం కాదు" అని వ్యాఖ్యానించారు. పిటిషనర్‌ను చట్ట ప్రకారమే నిర్బంధంలోకి తీసుకున్నారని, కాబట్టి ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయని తేల్చిచెప్పారు. "ఇక్కడ స్థిరపడటానికి మీకేం హక్కు ఉంది?" అని కోర్టు సూటిగా ప్రశ్నించింది.

తాను శరణార్థినని, శ్రీలంకలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది పదేపదే విన్నవించినప్పటికీ, ధర్మాసనం అంగీకరించలేదు. "భారతదేశం మీ కోసం ఎదురుచూడటం లేదు. మీరు కోరుకుంటే మరో దేశానికి వెళ్లవచ్చు" అని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. చట్టప్రకారం నిర్దేశించిన ప్రక్రియ పూర్తయిన తర్వాత పిటిషనర్‌ను శ్రీలంకకు పంపించాలని అధికారులను ఆదేశించింది.

# హైడ్రాలో డ్రైవర్ ఉద్యోగాలు .. పోటెత్తిన నిరుద్యోగులు ..

హైదరాబాద్, మే 19: ఇటీవల తెలంగాణలోని హైడ్రా సంస్థ (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొడక్షన్ ఏజెన్సీ).. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 200 డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి బుధవారం ( మే 19, 21 ) వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు రాసి స్వల్ప మార్కుల తేడాతో దూరమైన వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో రాష్ట్రంలోని నిరుద్యోగులు ఒక్కసారిగా పోటెత్తారు. హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరారు.

ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకునేందుకు అన్ని జిల్లాల నుంచి భారీగా యువత తరలి వచ్చారు. ఇవాళ ఉదయం 10 గంటల నుంచి క్యూ లైన్లో నిలబడి దరఖాస్తు చేసుకున్నారు. హైడ్రా గతంలో కూడా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలు నియామకాలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి నెలలో డీఆర్ఎఫ్ లోకి 357 కొత్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది. ఈ ఉద్యోగులు అంబర్ పేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో వారం రోజుల శిక్షణ అనంతరం ఫీల్డ్ లోకి పంపారు.

### పోస్టుల వివరాలు ఎలా ఉన్నాయి:

మొత్తం పోస్టుల సంఖ్య : 200

అర్హతలు: తెలంగాణలో గతంలో విడుదలైన పోలీస్ రిక్రూట్మెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని ఫైనల్ రాత పరీక్ష రాసి, ఎంపిక కాని అభ్యర్థులకు ప్రాధాన్యత.

ఉద్యోగం పేరు: డ్రైవర్ పోస్టులు

టెంపరరీ: ఔట్సోర్సింగ్ విధానంలో ఈ 200 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు.

ఎంత జీతం : విడుదలైన ప్రకటనలో జీతం వివరాలు తెలుపలేదు.

సెలక్షన్ ప్రాసెస్: ఎటువంటి రాత పరీక్ష లేకుండా అర్హతలు కలిగిన అభ్యర్థులకు అవుట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీ.

### నోటిఫికేషన్ ముఖ్యమైన తేదీలు:

దరఖాస్తులు ప్రారంభ తేదీ : 19బిష్ట మే, 2025.

దరఖాస్తులు ఆఖరి తేదీ : 21బబి మే, 2025

దరఖాస్తు ఫీజు: ఎటువంటి ఫీజు లేదు

# ఐదువేల పోస్టులు ...10 వేల దరఖాస్తులు మంత్రి పొంగులేటి ..

హైదరాబాద్, మే 19:రాష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపరచడానికి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.



భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామని ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావడానికి పెద్దసంఖ్యలో సర్వేయర్ల అవసరాన్ని గుర్తించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించగా 10,031 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై సోమవారం నాడు పొంగులేటి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఈనెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలి లోని సర్వే ట్రైనింగ్ అకాడమీ ( ౦౦౨ఎ౯) లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

### డిజిటలైజేషన్ ఆఫ్ విలేజ్ మ్యాప్స్

టిజిఆర్ఏసి ( తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్ చేపడుతన్నామని మంత్రి తెలిపారు. ప్రయోగాత్మకంగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లింగాల గ్రామం, జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి మూడు గ్రామాలలో ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నామని తెలిపారు.

ఈ డిజిటల్ మ్యాప్ లను ఎక్కడినుండైనా సులభంగా యాక్సెస్ చేయవచ్చని, మాన్యువల్ పద్ధతుల కంటే వేగంగా , తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన సమాచారం పొందవచ్చన్నారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి వంటి వివరాలు ఖచ్చితంగా పొందవచ్చున్నారు .

ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పునరుద్ధరణ , భద్రత డిజిటల్ రూపంలో భద్రంగా నిల్వ చేయవచ్చు కాలానుగుణంగా అప్డేట్ చేయవచ్చు అని వివరించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత : చెప్యాల రాజేశ్వర్‌రావు



ఖమ్మం, మే 19: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యుడు చెప్యాల రాజేశ్వర్ రావు అన్నారు. సోమవారం సాయంత్రం భద్రాచలం రాముల వారి దర్శన కోసం వచ్చిన ఆయన లక్ష్మిదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలోని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు సంగం శివ గృహంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కన్వీనర్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలను నాటడం ఒక యజ్ఞంలాగా చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు భద్రం శ్రీరామ్, నిరంజన్, రవి, నరేశ్, ప్రవీణ్, వంశీ, తరుణ్ పాల్గొన్నారు.

# తెలంగాణలో భారీ వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, మే 19: తెలంగాణలో మరో ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

మంగళవారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం కరీంనగర్ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే చాన్స్ ఉందని పేర్కొంది.

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది. అలాగే, గురు, శుక్ర వారాల్లోనూ ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది వాతావరణశాఖ. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నారాయణపేట జిల్లా మక్తల్‌లో 8 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదు.. పాక్ నుంచి అణు దాడి సంకేతాలు లేవు

న్యూఢిల్లీ, మే 19:భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. (ఔనీ జూ తీనీశ్రీవ తిని ఇవజీబవటతితీవ) అలాగే పాక్ నుంచి ఎలాంటి అణు దాడి సంకేతాలు లేవని పేర్కొంది. సోమవారం పార్లమెంటరీ కమిటీ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి సమాధానం ఇచ్చారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని తెలిపారు. సైనిక చర్యలు నిలిపివేయాలన్న నిర్ణయం రెండు దేశాల ద్వైపాక్షిక స్థాయిలో తీసుకున్నట్లు చెప్పారు.

కాగా, భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు తాను సహకరించినట్లు అమెరికా అధ్యక్షుడు సుమారు ఏడుసార్లు అన్నారు. దీనిపై భారత్ ఎందుకు మౌనంగా ఉన్నదని కొంతమంది ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. అయితే విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఈ వాదనను ఖండించారు. 'కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ఎలాంటి పాత్ర పోషించలేదు. మూడవ పక్షం ప్రమేయం లేని ద్వైపాక్షిక నిర్ణయం' అని ఆయన అన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయని ఇండియా టుడే పేర్కొంది.

మరోవైపు భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణ సాంప్రదాయ యుద్ధ పరిధిలోనే ఉన్నదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి తెలిపారు. పాకిస్థాన్ నుంచి ఎలాంటి అణు దాడి సంకేతాలు లేవని చెప్పారు. మే 10న రెండు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)లు అన్ని సైనిక చర్యలను నిలిపివేయడంపై ఒక అవగాహనకు వచ్చారని పలువురి సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కాగా, చైనా సైనిక ఆయుధాలు, హార్డ్‌వేర్‌ను పాకిస్థాన్ వినియోగించడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే 'వారు (పాక్) ఏమి ఉపయోగించినా పర్వాలేదు. వారి వైమానిక స్థావరాలను మనం తీవ్రంగా ఢీకొట్టామన్నదే ముఖ్యం' అని విక్రమ్ మిస్రి తెలిపారు. కోల్పోయిన భారతీయ యుద్ధ విమానాల సంఖ్య గురించి కొందరు సభ్యులు ప్రశ్నించారు. అయితే జాతీయ భద్రతా సమస్యగా పేర్కొంటూ సమాధానం చెప్పేందుకు మిస్రి నిరాకరించారు.

మరోవైపు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దని పార్లమెంట్ కమిటీ సభ్యులను విక్రమ్ మిస్రి కోరారు. ఆపరేషన్ సిందూర్ మొదటి దశ తర్వాత పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద లక్ష్యాలను మాత్రమే ధ్వంసం చేసినట్లు పాకిస్థాన్‌కు జైశంకర్ తెలియజేశారని ఆయన స్పష్టం చేశారు.

# టెక్స్‌టైల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం..

# యజమాని సహా ఎనిమిది మంది సజీవదహనం

ముంబై, మే 19: మహారాష్ట్రలోని షోలాపూర్ పారిశ్రామిక హబ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మరణించారు. షోలాపూర్‌లో ఎండీఐసీలోని సెంట్రల్ టెక్స్‌టైల్ మిల్స్‌లో తెల్లవారుజామున 3.45 గంటలకు ఒక్కసారిగా మంటలు చెరలేగాయి. క్రమంగా అవి ఫ్యాక్టరీ మొత్తం విస్తరించడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. సుమారు ఆరు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని తెలిపారు.

మంటల్లో ఎనిమిది మంది చనిపోయారని చెప్పారు. వారిలో ముగ్గురు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారని వెల్లడించారు. మృతుల్లో ఫ్యాక్టరీ యజమానితోపాటు, అతని ఏడాదిన్నర వయుస్సు కలిగిన మనవడు, ముగ్గురు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారని తెలిపారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారని, వారిని దవాఖానకు తరలించామన్నారు. భారీగా అగ్నికీలలు ఎగసిపడటంతో మంటలను అదుపుచేయడానికి 5 నుంచి 6 గంటలపాటు శ్రమించాల్సి వచ్చిందని చెప్పారు.




# సంస్థలకు గుండెకాయ హెచ్ఆర్ నిపుణులు !

(20 మే "అంతర్జాతీయ హెచ్ఆర్ శిమానవ వనరులరి నిపుణుల దినోత్సవం" సందర్భంగా)

కంపెనీ లేదా పరిశ్రమ లేదా పని ప్రదేశంలో పని సంస్కృతి (వర్క్ కల్చర్), సానుకూ వాతావరణాలు, ఉద్యోగుల నియామకాలు, కంపెనీ అభివృద్ధి, ఉద్యోగుల నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగుల యోగక్షేమాలు, ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణాన్ని కల్పించడం, జట్టు స్ఫూర్తిని రగల్చడం లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తున్నారు మానవ వనరుల విభాగాలు లేదా హూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్) విభాగ నిపుణులు. హెచ్ఆర్ నిపుణులు కాలానుగుణంగా మారుతూ, నిన్నటి సాంప్రదాయ విధులకు తోడుగా నేటి డిజిటల్ ఏఐ యుగపు టెక్నాలజీలను కూడా ఆకళింపు చేసుకుంటూ తమ విధులను, తమ పరిమితులను విస్తరించుకుంటూ, పునర్నిర్వచించుకుంటూ, టెక్నాలజీని ఆలింగనం చేసుకుంటూ, ఏఐ టెక్నాలజీలను అనుసంధానం చేసుకుంటూ, సంస్థ సమగ్రాభివృద్ధికి ఊతం ఇస్తున్నారు.

## అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం:

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక సంస్థ లేదా బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సి) పురోగతిలో మానవ వనరుల నిపుణుల పాత్ర వెలకట్టలేనిది. కంపెనీ ప్రగతిలో హెచ్ఆర్ నిపుణుల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2019 నుంచి ప్రతి ఏట 20 మే రోజుల "అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ హెచ్ఆర్ డే" పాటించడం జరుగుతోంది. కంపెనీ లేదా సంస్థలో ఉద్యోగుల శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిగత పురోగతి మాత్రమే తమ లక్ష్యంగా హెచ్ఆర్ నిపుణులు అమూల్య సేవలను అందిస్తున్నారు. 2025 అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం ఇతివృత్తంగా "హూమనిపై ఏఐ – లీడింగ్ హెచ్ఆర్ టుగెదర్ (ఏఐ యుగంలో మానవీయత – ఐక్యతతో మానవ వనరుల పయనాలు)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవ వేదికగా హెచ్ఆర్ విభాగ ఉద్యోగుల పాత్రను దృష్టిలో పెట్టుకొని ప్రోత్సహించడం, సరదా క్రీడలు ఏర్పాటు చేయడం, విజయవంతమైన వ్యక్తులు చేపట్టిన విలక్షణ పద్ధతులను ప్రచారం చేయడం, హెచ్ఆర్ ఉద్యోగులకు బహుమతులు అందించడం లేదా ప్రోత్సాహక వేతనాలను విడుదల చేయడం, ఆ సిబ్బంది సేవలను ప్రస్తుతించడం, సామాజిక మాధ్యమ వేదికగా పురస్కారాలు/అభినందనలు తెలియజేయడం, హెచ్ఆర్ విభాగ సభ్యుల యోగ క్షేమాలను తెలుసుకోవడం, వారి వ్యక్తిగత లేదా ఉద్యోగ సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. హెచ్ఆర్ నిపుణుల కృషితో పని ప్రదేశంలో ఆశావహ వాతావరణం, పని భద్రత, అధిక ఉత్పత్తి లాంటివి జరుగుతాయని తెలుసుకోవాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నైపుణ్య యువశక్తితోనే వికసిత భారతం

– లయన్: కెప్టెన్ డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి




హైదరాబాద్, మే 19:ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో యువ జనాభా కూడా అత్యధికంగా ఉండడంతో నేటి యువశక్తి సన్మార్గంలో ముందుకు సాగితే 2047 నాటికి వికసిత భారతదేశం సుసాధ్యం అవుతుందని ప్రముఖ కాలమిస్ట్ విశ్రాంత ప్రిన్సిపల్ లయన్: కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. హుజూరాబాద్ సింగపూర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక జాతీయ అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపులో పాల్గొంటున్న ఐదు రాష్ట్రాల కెడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ యువభారతాన్ని ఉజ్వల భవిష్యత్తు ఉందని, నేటి యువశక్తి రేపటి అభివృద్ధి చెందిన భారతానికి పునాదిగా నిలుస్తుందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని అన్నారు. అమెరికాలో 35 కోట్ల జనాభా ఉంటే భారత్‌లో అంత కన్న ఎక్కువ యువ జనాభా ఉందని గర్వంగా తెలిపారు. నేటి యువత అకడమిక్‌గా ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు, ఉన్నత వ్యక్తిత్వం కలిగి ఉండాలని సూచించారు. యువశక్తికి నైపుణ్యం తోడైతే రానున్న కాలం భారత్‌దే అవుతుందని తెలిపారు. సభాధ్యక్షత వహించిన క్యాంపు కమాండెంట్ కర్నల్ ఏ జయంత మాట్లాడుతూ యువ కెడెట్లు క్రమశిక్షణతో తమ లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డిని జ్ఞాపికతో సన్మానించారు.

ఈ రోజు కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన సైబర్ క్రైమ్ విభాగం కెడెట్లకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి, కెడెట్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

# మాతృమూర్తులకు శుభవార్త.. ఎన్టీఆర్ బేబీ కిట్లు పథకం పునరుద్ధరణ

అమరావతి, మే 19: ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్టీఆర్ బేబీ కిట్ పేరుతో ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం అయిన తల్లులకు కిట్లు అందించనున్నారు. 2016లో ఈ ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం ప్రారంభించారు.

అయితే 2019 తరువాత బేబీ కిట్ పథకం ఆగిపోయింది.

## బేబీ కిట్ పథకంలో ఏమేమి ఉంటాయి..

బేబీ కిట్‌లో దోమతెర, దుప్పటి, స్లీపింగ్ బెడ్, యాంటీసెప్టిక్ లోషన్‌తో పాటుగా నాప్‌కిన్, డైపర్లు, షాంపూ వంటి 11 రకాల సామాగ్రి ఉంటుంది.

ఈ కిట్‌లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఉచితంగా అందజేస్తారు.

దీనికోసం 51 కోట్ల 14 లక్షల 77 వేలు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కో కిట్ కు 1410/- ఖర్చు పెట్టనుంది ప్రభుత్వం

# హజ్ యాత్రికుల సౌకర్యం-శ్రేయస్సుపై ప్రభుత్వం నిబద్ధతతో ఉంది: మంత్రి

న్యూఢిల్లీ, మే 19:కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, మత్స్య-పశుసంవర్ధక-పాడిపరిశ్రమ శాఖల సహాయ మంత్రి శ్రీ జార్జ్ కురియన్ ఈ రోజు కొచ్చి నుంచి తొలి హజ్-2025 యాత్రికుల విమానానికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రయాణికులు విమానం ఎక్కే ప్రదేశం వద్ద యాత్రికులనుద్దేశించి మాట్లాడుతూ వారందరికీ తొలుత శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్ర ఆధ్యాత్మిక సుసంపన్నంగా, సజావుగా, సురక్షితంగా సాగాలని హృదయపూర్వకంగా అభిలషిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాత్రికుల సౌకర్యం, శ్రేయస్సుకు భరోసా ఇవ్వడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని శ్రీ కురియన్ చెప్పారు. ఇందులో భాగంగా ''సౌదీ అధికారులతో సమన్వయంతో జెద్దాలోని భారత కాన్సుల్ జనరల్ కార్యాలయం హజ్ యాత్రికులకు వైద్య సహాయం, ప్రయాణ-రవాణా సదుపాయాలు సహా ఇతరత్రా అవసరమైన ఏర్పాట్లన్నీ చేసింది. దీంతో ఈ పవిత్రయాత్ర ఎలాంటి ఇబ్బందులకూ తావులేని రీతిలో దివ్యానుభూతినిస్తుంది" అని ఆయన వివరించారు.

అనంతరం యాత్రికులతో ముచ్చటిస్తూ- హజ్ యాత్రను మరింత సమగ్రం, సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు దరఖాస్తు ప్రక్రియ డిజిటలీకరణ, ఎంపికలో పారదర్శకత పెంపు, విమానం ఎక్కే ప్రదేశాల్లో మెరుగైన సదుపాయాలు తదితరాల విషయంలో ఈ ఏడాది కీలక సంస్కరణలు అమలులోకి తెచ్చామని వివరించారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ హజ్ యాత్ర సంసిద్ధ ప్రక్రియ మరింత అందుబాటులోకి వచ్చిందని చెప్పారు.

పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికోసం ప్రభుత్వం సంస్కరణలు చేపట్టడంపై ఈ సందర్భంగా యాత్రికులందరూ కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆవిష్కరణలు, ఇతర సంస్కరణల వల్ల యాత్రికులందరికీ ఈ హజ్-2025 పవిత్ర యాత్ర మరో కీలక మలుపుగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# ఆకాష్టీర్: భారత వినూత్న యుద్ధ సామర్థ్యం వెనుక అదృశ్య శక్తి

న్యూఢిల్లీ, మే 19:ఓ సరికొత్త ఆయుధం... చీకటి కమ్మిన ఆకాశంలో నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతుంది. అది ఫైటర్ జెట్ తరహాలో దిక్కులు పిక్కటిల్లే శబ్దం చేయదు లేదా క్షిపణిలా విరుచుకుపడదు. అది చిరుశబ్దాన్ని కూడా పసిగట్టగలదు.. కచ్చితమైన అంచనాతో... మెరుపుదాడి చేయగలదు. ఈ అదృశ్య ఛత్రం పేరే "ఆకాష్టీర్"... ఇదిప్పుడు రక్షణరంగ పత్రికల సమాచారానికి పరిమితమైన భావన కాదు. భారత గగనతల రక్షణ అమ్ములపొదిలో ఇప్పుడు పదునైన ఆయుధం. ఇదొక దుర్భేద్య అదృశ్య దుర్గం... ఈ నెల 9, 10 తేదీల్లో పాకిస్థాన్ నిశిరాత్రి భారత సైనిక, పౌర ఆవాసాలపై అత్యంత పాశవికంగా క్షిపణులు, డ్రోన్లతో దాడికి తెగబడినప్పుడు వాటన్నిటినీ తుత్తునియలు చేసిన శక్తి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన స్వయంచలిత గగనతల రక్షణ నియంత్రణ-నివేదన వ్యవస్థ 'ఆకాష్టీర్.' మన భూభాగంలో ప్రవేశించిన ప్రతి గగనతల ఆయుధాన్ని మార్గమధ్యంలోనే బదాబదలు చేసింది.

పొరుగు దేశానికి, అది నిర్దేశించుకున్న లక్ష్యాలకు అడ్డుగోడగా నిలిచింది మన సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యం ఒక్కటే కాదు... స్వయంసమృద్ధ భారత్ సంకల్ప సాకారంపై ఏళ్ల తరబడి కొనసాగుతున్న నిబద్ధత కూడా. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 వ్యవస్థలపై పాకిస్థాన్ ఆధారపడింది. కానీ, భారత్ నుంచి నిశిత దాడులను గుర్తించడంలో అవి చతికిలపడ్డాయి. అదే సమయంలో తక్షణ, స్వయంచలిత గగనతల రక్షణ యుద్ధరీతిలో భారత్ ఆధిపత్యాన్ని 'ఆకాష్టీర్' నిరూపించింది.

ప్రపంచం ప్రయోగించే దేన్నయినా- పసిగట్టి... కచ్చితమైన నిర్ణయంతో... నిర్వీర్యం చేయగల సామర్థ్యాన్ని 'ఆకాష్టీర్' నిరూపించుకుంది.

బహుళ శక్తుల ఏకీకరణతో రూపొందిన ఈ వ్యవస్థ పొరపాటున పరస్పర కాల్పుల ముప్పును తగ్గిస్తుంది. వివాదాస్పద గగనతలంలో విమానాల రక్షణకు భరోసా ఇస్తూ శత్రు లక్ష్యాలను వేగంగా ఛేదించే వీలు కల్పిస్తుంది. ఈ మేరకు వ్యూహాత్మక నియంత్రణ రాడార్ నివేదన వ్యవస్థ, 3డి వ్యూహాత్మక నియంత్రణ రాడార్లు, దిగువస్థాయి తేలికపాటి రాడార్, ఆకాష్ ఆయుధ వ్యవస్థ రాడార్ వంటివి సెన్సర్లలో ఏకీకృతం చేయబడ్డాయి.

ఆకాష్టీర్: సాత్విక రాడార్ నుంచి చురుగ్గా తిప్పికొట్టగల శక్తి దాకా...

ఆకాష్టీర్ గుడ్డిగా తనపని చేసుకుపోయే శక్తి కాదు... ఇది బుద్ధి కుశలతతో పనిచేసే వ్యవస్థ. ఇందులోని (కంట్రోల్ రూమ్, రాడార్లు, డిఫెన్స్ గన్ వంటి) భాగస్వాములకు ఎప్పటికప్పుడు సార్వత్రిక గగనతల దృశ్యాన్ని ముందుంచుతుంది. తద్వారా గగనతల రక్షణ కార్యకలాపాల మధ్య కచ్చితమైన సమన్వయానికి తోడ్పడుతుంది. శత్రు విమానాలు, డ్రోన్లు, క్షిపణులను గుర్తించి, వాటి జాడను అనుసరిస్తూ, నిర్వీర్యం చేయడానికి ఉద్దేశించిన వ్యవస్థ ఇది. వివిధ రాడార్ వ్యవస్థలు, సెన్సర్లు, కమ్యూనికేషన్ సాంకేతికతలను ఇది ఒకే కార్యనిర్వహణ చట్రంలో ఇముడుస్తుంది. అనేక వనరుల ద్వారా సమాచారం సేకరించి, విశ్లేషించి స్వయంచలిత, తక్షణ దాడి నిర్ణయాలకు 'ఆకాష్టీర్' వెసులుబాటు కల్పిస్తుంది. ఇది విస్తృత "సి4ఐఎస్ఆర్" (కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, ఇంటలిజెన్స్, సర్వైలెన్స్ అండ్ రికనైసెన్స్) చట్రంలో భాగం. అంతేకాదు... ఇతర వ్యవస్థలతో సమన్వయం చేసుకోవడమేగాక ఇది వాహనాధారిత సంచార వ్యవస్థ కాబట్టి, ప్రతికూల వాతావరణంలోనూ పరిస్థితులను నిభాయించగలదు.

క్షేత్రస్థాయి రాడార్లు, మానవ నిర్ణయాధారిత సంప్రదాయ గగనతల రక్షణ ఉపకరణాల తరహాలో కాకుండా యుద్ధ క్షేత్రంలో దిగువ స్థాయి గగనతల ప్రదేశంలో స్వయంచలిత పర్యవేక్షణ, క్షేత్రస్థాయి గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థల సమర్థ నియంత్రణకు ఆకాష్టీర్ వీలు కల్పిస్తుంది. సాత్విక రక్షణ నుంచి చురుగ్గా తిప్పికొట్టగల శక్తివైపు భారత వ్యూహాత్మక సూత్రంలో విస్పష్ట పరిణామానికి ఇది సూచిక. దీన్ని విస్తృత "సి4ఐఎస్ఆర్" వ్యవస్థతో కచ్చితంగా ఏకీకృతం చేయడం వల్ల సైన్యం, నావికాదళం, వైమానిక దళాలు అద్భుత సమన్వయంతో వ్యవహరించగలవు.

## భారత ఏకీకృత గగనతల రక్షణ నెట్‌వర్క్: అత్యంత ప్రభావశీల నిశ్శబ్ద శక్తి

ఆకాష్టీర్ భారత సైనిక గగనతల (ఎఎడి) వ్యవస్థలో కీలక భాగం. ఇది 'ఐఎసిసిఎస్' (వైమానిక దళం), 'త్రిగుణ్' (నావికాదళం) వ్యవస్థలతో కచ్చితంగా అనుసంధానితమైంది. యుద్ధక్షేత్రం సుస్పష్ట, తక్షణ దృశ్యాన్ని ఇది ఆవిష్కరిస్తుంది. తద్వారా ఎదురుదాడికే కాకుండా స్వీయ రక్షణ దిశగా ఆయుధాల సత్వర, సమర్థ ప్రయోగానికి వీలు కల్పిస్తుంది.

త్రివిధ దళాలు 'ఆకాష్టీర్'ను సంయుక్తంగా వినియోగిస్తున్న కారణంగా అవాంఛిత పరస్పర కాల్పుల ప్రమాదం కనిష్ఠ స్థాయికి పరిమితం. పరిస్థితులపై మెరుగైన అవగాహన కల్పిస్తుంది కాబట్టి, నిర్దిష్ట-శక్తిమంతమైన కార్యాచరణకు వీలుంటుంది. వాహనంపై అమర్చిన, సంచార వ్యవస్థగనుక ప్రత్యక్ష యుద్ధ, ప్రమాదకర ప్రాంతాల్లో మోహరించడానికి అనువైనది.

## స్వదేశీ సానుకూలత

ఆకాష్టీర్ ఒంటరి శక్తి కాదు.... భారత యుద్ధ విధాన సామర్థ్యాలను పునర్నిర్మిస్తున్న స్వదేశీ రక్షణ వేదికల రూపకల్పనావరణంలో ఇదొక భాగం. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం రక్షణ రంగ వృద్ధికి దోహదం చేసింది. ఆ మేరకు "ధనుష్ ఆర్టిలరీ గన్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్, మెయిన్ బాటిల్ ట్యాంక్ అర్జున్, లైట్ స్పెషలిస్ట్ వెహికల్స్, హై మొబిలిటీ వెహికల్స్, లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్, లైట్ యుటిలిటీ హెలికాప్టర్, వెపన్ లొకేటింగ్ రాడార్, 3డి టాక్టికల్ కంట్రోల్ రాడార్, సాఫ్ట్ వేర్ డిఫైన్డ్ రేడియో, డిస్ట్రాయర్లు, స్వదేశీ విమాన వాహకాలు, జలాంతర్గాములు, యుద్ధనౌకలు, కార్వెట్‌లు, ఫాస్ట్ పట్రోల్ వెసెల్స్, ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్, ఆఫ్‌షోర్ పట్రోల్ వెసెల్స్ వంటి నావికాదళ ఆయుధ సంపత్తి సహా అధునాతన సైనిక వేదికల రూపకల్పన సాధ్యమైంది.

రక్షణ రంగ ఉత్పత్తి సామర్థ్యం 2029కల్లా రూ.3 లక్షల కోట్లకు చేరాలన్నది భారత్ లక్ష్యం. తద్వారా ప్రపంచ రక్షణ తయారీ కూడలిగా తన స్థానం పటిష్ఠం చేసుకోనుంది.

ఈ లక్ష్యసాధనలో ప్రైవేట్ రంగానిదే కీలక పాత్ర. ఈ మేరకు మొత్తం రక్షణ ఉత్పత్తిలో 21 శాతం వాటాతో ఆవిష్కరణలు సహా సామర్థ్యాన్ని పెంచుతుంది.

స్వదేశీ ఉత్పాదక సామర్థ్యం పెంపులో 16 'డిపిఎస్‌యు'లు, 430 కిపైగా లైసెన్స్ పొందిన కంపెనీలు, సుమారు 16,000 'ఎంఎస్ఎంఇ'లు వంటి బలమైన రక్షణ పారిశ్రామిక కూడలిగా రూపొందుతుంది.

ఇప్పుడు రక్షణ పరికరాల్లో 65 శాతం దేశీయంగా తయారవుతున్నాయి. లోగడ 65 నుంచి 70 శాతం దిగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండగా, నేడు గణనీయ మార్పుతో భారత రక్షణ రంగం స్వయంసమృద్ధిని ప్రతిబింబిస్తోంది.

## ఆకాష్టీర్: ఓ వ్యవస్థకు అతీతం... ప్రపంచానికి ఒక సందేశం

ఆకాష్టీర్‌ను "యుద్ధ వ్యూహంలో వినూత్న మలుపు"గా ప్రపంచవ్యాప్త నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ వ్యవస్థను రూపొందించడం ద్వారా పూర్తి సమీకృత, స్వయంచలిత, గగనతల నియంత్రణ-నిర్వహణ సామర్థ్యంగల దేశాల విశిష్ట జాబితా కెక్కింది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైనది... రెప్పపాటులో ముప్పును పసిగట్టడమే కాదు... తక్షణ నిర్ణయంతో మెరుపుదాడి చేయగల సామర్థ్యం దీని సొంతం.

'ఆకాష్టీర్' కేవలం ఒక సాంకేతిక అద్భుతం మాత్రమే కాదు... పొంతనలేని యుద్ధరీతి, మిశ్రమ ముప్పులు, సరిహద్దు ఉగ్రవాదం తదితరాలకు తిరుగులేని జవాబు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్ దాడులను నిర్వీర్యం చేయడంలో భారత్ దీన్ని విజయవంతంగా వినియోగించింది. దిగుమతి చేసుకున్న వేదికలపై కాకుండా, స్వయంసమృద్ధి సంకల్ప సాకారానికి దోహదపడే స్వీయ ఆవిష్కరణలపైనే భారత రక్షణ రంగ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఇది రుజువు చేసింది.

# న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఈరోజు నూతన మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎమ్ఏసీ)ని ప్రారంభించిన కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, మే 19:కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కొత్త మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎమ్ఏసీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృఢ రాజకీయ సంకల్పానికి, నిఘా సంస్థల కచ్చితమైన సమాచారం, మన త్రివిధ దళాల సామర్థ్యానికి ఆపరేషన్ సిందూర్ ఒక ప్రత్యేక చిహ్నంగా నిలుస్తుందన్నారు. భారత త్రివిధ దళాలు, సరిహద్దు భద్రతా దళం, భద్రతా సంస్థలు దేశానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్టల కొండల్లో (కెజిహెచ్) కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్‌లు) నిర్వహించిన చరిత్రాత్మక నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ మన భద్రతా దళాల మధ్య అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శించిందని కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇదేవిధమైన సమన్వయం కనిపించిందన్నారు. బాధ్యతల నిర్వహణలో నిఘా సంస్థలు, త్రివిధ దళాల మధ్య ప్రక్రియలు, ఆలోచనల పరంగా చక్కటి సమన్వయాన్ని ఈ ఆపరేషన్ ప్రదర్శించిందని శ్రీ అమిత్ షా తెలిపారు.

ప్రస్తుతం మన ముందున్న సంక్లిష్టమైన, పరస్పర అనుసంధానితమైన జాతీయ భద్రతా సవాళ్ల పరిష్కారం కోసం అన్ని సంస్థల ప్రయత్నాలను సమన్వయం చేసే ఒక అనువైన, సమగ్రమైన వేదికను ఈ కొత్త ఎమ్ఏసీ అందిస్తుందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, సైబర్ దాడుల వంటి తీవ్రమైన ముప్పును ఎదుర్కోవడానికి దేశం చేస్తున్న ప్రయత్నాలను ఈ కొత్త నెట్‌వర్క్ బలోపేతం చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కొత్త ఎమ్ఏసీ నెట్‌వర్క్ ఏర్పాటును ప్రశంసించిన శ్రీ అమిత్ షా... రికార్డు సమయంలో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సంబంధిత పనులు విజయవంతంగా పూర్తి చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్ఏసీ, జీఐఎస్ సేవలతో విస్తారమైన డేటాబేస్ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి ఏఐ/ఎమ్ఎల్ టెక్నిక్‌ల వంటి భవిష్యత్ సామర్థ్యాలను దీనిలో ఉపయోగించారని ఆయన తెలిపారు. కొత్త ఎమ్ఏసీ ఏర్పాటుతో అందుబాటులోకి వచ్చిన అధునాతన డేటా విశ్లేషణలను ఉపయోగించుకోవడానికి ఈ వేదికపై వివిధ కేంద్ర సంస్థల వద్ద ఉన్న ఇతర ముఖ్యమైన డేటా బేస్‌లన్నీ ఏకీకృతం చేయవలసిన అవసరాన్ని ప్రధానంగా ప్రస్తావించిన ఆయన భవిష్యత్తు రోడ్‌మ్యాప్‌ను కూడా వివరించారు. ఎమ్ఏసీ నెట్‌వర్క్‌లో ఉత్పత్తి చేసిన డేటా అనలిటిక్స్ నాణ్యతను ఈ కొత్త నెట్‌వర్క్ ఉన్నత స్థాయికి మెరుగుపరుస్తుందనీ, అలాగే కచ్చితమైన ట్రెండ్ విశ్లేషణ, హాట్‌స్పాట్ మ్యాపింగ్, టైమ్‌లైన్ విశ్లేషణలు అంచనాత్మక, కార్యాచరణ ఫలితాలను అందించేందుకు ఇది వీలు కల్పిస్తుందని శ్రీ అమిత్ షా వివరించారు. వ్యవస్థీకృత నేరాలతో సంక్లిష్టమైన సంబంధాలను కలిగి ఉన్న ఉగ్రవాద వ్యవస్థను ఎదుర్కోవడంలో కొత్త ఎమ్ఏసీ చాలా కీలకంగా వ్యవహరించగలదని ఆయన తెలిపారు. దేశంలోని అగ్రగామి ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ సెంటర్‌గా... మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎమ్ఏసీ) 2001 నుంచి కార్యకలాపాలు సాగిస్తోంది. ఎమ్ఏసీ సాంకేతిక నవీకరణ ప్రక్రియలో నిరంతరం కేంద్ర హోం మంత్రి చురుగ్గా మార్గనిర్దేశం చేస్తున్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరోతో కలిసి, కొత్త ఎమ్ఏసీ అన్ని నిఘా, భద్రతా సంస్థలను, చట్టాలను అమలు చేసే సంస్థలను, దర్యాప్తు సంస్థలను అనుసంధానించింది. 500 కోట్లకు పైగా ఖర్చుతో అమలు చేసిన కొత్త ఎమ్ఏసీ నెట్‌వర్క్ గుణాత్మక, పరిమాణాత్మక పరివర్తన సాధించింది. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న కొత్త ఎమ్ఏసీ నెట్‌వర్క్, దేశంలోని ద్వీప భాగాలు, తిరుగుబాటు ప్రభావిత ప్రాంతాలు, ఎత్తైన పర్వత భూభాగాలను అనుసంధానించింది. ఇది వేగవంతమైన, సురక్షితమైన స్వతంత్ర నెట్‌వర్క్‌తో మారుమూల ప్రాంతాల్లోని జిల్లాల ఎస్పీల స్థాయి వరకు సుదూర ప్రాంతాలను కచ్చితత్వంతో అనుసంధానిస్తుంది.

# 150 బిలియన్లు దాటిన 'ఆధార్' ప్రమాణీకృత లావాదేవీలు

## భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, సంక్షేమ సేవలకు ఊతం

న్యూఢిల్లీ, మే 19:ఆధార్ ప్రమాణీకరణ సంబంధిత లావాదేవీల మొత్తం సంఖ్య 150 బిలియన్ల (15,011.82 కోట్ల) స్థాయిని మించిపోయింది. ఇది భారతీయ విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా- యూఐడీఏఐ) ప్రస్థానంతోపాటు 'ఆధార్' అనుబంధ విస్తారిత వ్యవస్థ ఎదుగుదలలో ఒక ముఖ్య ఘట్టాన్ని సూచిస్తోంది.

'ఆధార్'ను విరివిగా ఉపయోగిస్తున్నారనీ, దేశంలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వర్ధిల్లుతోందనీ ఈ మహత్తర సన్నివేశం ప్రముఖంగా చాటిచెబుతోంది. 'ఆధార్'ను ఆరంభించిన దగ్గర నుంచీఈ సంవత్సరం ఏప్రిల్ వరకు గణాంకాలను పరగణనలోకి తీసుకున్నారు.

జీవించడాన్ని సులభతరంగా మార్చడంలో, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ సేవాప్రదాత సంస్థలు సమకూర్చే వివిధ సేవలను స్వచ్ఛందంగా పొందడంలో 'ఆధార్' ఆధారిత ప్రమాణీకరణ ఒక ముఖ్య భూమికను పోషిస్తోంది. ఒక్క ఏప్రిల్‌లోనే, దాదాపు 210 కోట్ల 'ఆధార్' ఆధారిత ప్రమాణీకరణ లావాదేవీలు జరిగాయి. ఇది 2024 లో ఏప్రిల్‌లో జరిగిన లావాదేవీలతో పోల్చి చూసినప్పుడు సుమారు 8 శాతం ఎక్కువని తేలింది.

ఈకేవైసీతో వినియోగదారు అనుభవంలో మెరుగుదల

ఆధార్ ఈకేవైసీ సేవ అనేది బ్యాంకు సేవలు, ఇతర ఆర్థిక సేవలు సహా ఇతర రంగాల్లో వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడంలో, వ్యాపార నిర్వహణను సులభతరంగా మార్చడంలో ఓ కీలక పాత్రను పోషిస్తూ వస్తోంది.

2025 ఏప్రిల్‌లో జరిగిన ఈకేవైసీ లావాదేవీల (37.3 కోట్లు) మొత్తం సంఖ్య గడచిన సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 39.7 శాతం ఎక్కువ. 2025 ఏప్రిల్ నాటికి ఈకేవైసీ లావాదేవీల మొత్తం సంఖ్య 2393 కోట్లను మించింది.

యూఐడీఏఐ ఆధారిత ముఖ ప్రమాణీకరణ ప్రక్రియకు పెరుగుతున్న ఆదరణయూఐడీఏఐ సొంతంగా అభివృద్ధిచేసిన కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) ఆధారిత ముఖ ప్రమాణీకరణ (ఫేస్ అథెంటికేషన్) పద్ధతి ప్రజాదరణకు నోచుకొంటోంది. ఏప్రిల్‌లో ఈ తరహా కార్యకలాపాలు ఇంచుమించుగా 14 కోట్ల మేరకు జరిగాయి. ఇది ఈ ప్రమాణీకరణ పద్ధతిని అంగీకరించడంతోపాటు ఆధార్ సంఖ్యను కలిగి ఉన్న వారికి దీనితో ఎలాంటి సహజ ప్రయోజనాలు లభిస్తున్నాయో తెలియజేస్తోంది. ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు రెండిటిలో 100 కన్నా ఎక్కువ సంస్థలు ప్రయోజనాలు, సేవలను సాఫీగా అందజేయడం కోసం ముఖ ప్రమాణీకరణ పద్ధతిని ఉపయోగించుకొంటున్నాయి.

# డయాలసిస్ కేంద్రం ప్రారంభం



ఇచ్ఛాపురం, మే 19: ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలో 5 పడకల కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రారంభించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.కళ్యాణ్ బాబుతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పి.దేవేంద్ర రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

అప్పట్లో పవన్ కళ్యాణ్ కిడ్నీ వ్యాధి తీవ్రతను వెలుగులోకి తీసుకువస్తే చంద్రబాబు వెంటనే స్పందించి కిడ్నీ రోగులకు పింఛన్లు, మందులు, శుద్ధ జలాలు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టినట్లు చెప్పుకొచ్చారు. అత్యవసర వైద్యం అందించే స్టేబిమా యూనిట్, అధునాతన బయో కెమిస్ట్రీ ల్యాబరేటరీ, డయాలసిస్ కేంద్రంలో ఆర్ ఓ ప్లాంట్ ను ప్రారంభించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సన్మానం



ఆదిలాబాద్, మే 19: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ స్థానిక నాయకులు సన్మానించారు. సరస్వతి పుష్కరాలకు కాళేశ్వరానికి వెళ్తున్న బండి సంజయ్ ను మార్గమధ్యలోని చెన్నూర్ జాతీయ రహదారిలో మంత్రికి స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. మరి కొద్ది రోజుల్లో మంత్రి సమక్షంలో పార్టీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరో వైసీపీ కౌన్సిలర్‌కు టీడీపీ తీర్థం

అమరావతి, మే 19:విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చిన్ని సమక్షంలో తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి తిరువూరు మున్సిపాలిటీ 11వ వార్డ్ కౌన్సిలర్ కాకర్లమూడి. సుందర కుమార్, 1వ వార్డ్ కౌన్సిలర్ భర్త కొలికపోగు. చంటి చేరారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో ఇరువురిని తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఎంపీ కేశినేని శివనాథ్ ఆహ్వానించారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి..

అమరావతి, మే 19: ప్యాపిలి మండలం, పోతుదొడ్డి వద్ద గత అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని తుంకూర్ కి చెందిన సంతోష్ (36), నవీన్ (43), లోకేష్ (35) శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి కర్ణాటక రాష్ట్రం తుంకూరుకి వెళ్తుండగా మార్గ మధ్యలో ప్యాపిలి మండలం, పోతుగల్ వద్ద వీరు వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. వీరు వెళ్తున్న వాహనం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు యువకులు మృతి చెందారు.

# ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐఏఎఫ్ విరుచుకుపడింది... ఆధిపత్యాన్ని సాధించడమే కాకుండా వాళ్లను మట్టికరిపించింది

న్యూఢిల్లీ, మే 19:గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరం వద్ద వాయుసేన సిబ్బందిని ఉద్దేశించి ఈ రోజు(2025, మే 16) రక్షణమంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటం భద్రతకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇప్పుడు అది రక్షణ సిద్ధాంతంలో భాగం. ఈ ద్విముఖ, పరోక్ష యుద్ధాన్ని కూకటివేళ్లతో సహా పెకలిస్తాం" అని రక్షణ మంత్రి అన్నారు. ప్రస్తుత కాల్పుల విరమణ పాకిస్థాన్‌కు పరీక్ష అని, ఆ దేశ ప్రవర్తనను భారత్ పరిశీలిస్తోందని పేర్కొన్నారు. ప్రవర్తన మెరుగుపడితే మంచిదే.. కానీ ఏదైనా అవాంతరాలు సృష్టిస్తే మాత్రం కఠినమైన శిక్ష విధిస్తామని తెలిపారు.

ఆపరేషన్ సింధూర్ ఇంకా పూర్తి కాలేదని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. "మేం చేపట్టిన చర్యలు ట్రైలర్ మాత్రమే. అవసరమైతే సినిమా మొత్తం చూపిస్తాం. 'ఉగ్రవాదంపై దాడి చేసి, తరిమికొట్టడం' ఇదే నవ భారత్ అనుసరిస్తున్న నూతన విధానం" అని ఆయన అన్నారు.

భారత్ నాశనం చేసిన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పాకిస్థాన్ పునర్నిర్మిస్తోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇస్లామాబాద్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అందించిన బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని పునఃపరిశీలించాలని, భవిష్యత్తులో ఎలాంటి సాయం అందించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల్లో సుమారుగా 14 కోట్ల రూపాయలను జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థ నాయకుడు మసూద్ అజార్‌కు పాకిస్థాన్ ఇస్తోంది. అతడిని ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదిగా గుర్తించింది. పాకిస్థాన్ ప్రభుత్వం మురిద్కే, బహావల్పూర్‌లో లష్కర్- ఎ-తైబా, జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రసంస్థల మౌలిక సదుపాయాలను పునర్నిర్మించేందుకు ఆర్థిక సాయాన్ని కూడా ప్రకటించింది. ఐఎంఎఫ్ అందించిన ఒక బిలియన్ డాలర్ల ఆర్థిక సాయంలో పెద్ద మొత్తాన్ని ఉగ్రవాద మౌలిక వసతులను మెరుగుపరిచేందుకే పాకిస్థాన్ ఉపయోగిస్తుంది. దీనిని ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థ ఉగ్రవాదానికి అందిస్తున్న పరోక్ష సాయంగా పరిగణించాలా పాకిస్థాన్‌కు అందించే ఏ సాయమైనా అది ఉగ్రవాదులకు నిధులు అందించడం లాంటిదే. భారత్ అందిస్తున్న నిధులను ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా పాకిస్థాన్ లేదా మరే దేశంలోనైనా ఉగ్ర మౌలికసదుపాయాల కల్పనకు ఐఎంఎఫ్ ఉపయోగించకూడదు" అని అన్నారు.

ప్రపంచమంతా ప్రశంసించిన ఆపరేషన్ సిందూర్‌లో భారతీయ వాయుసేన (ఐఏఎఫ్) పోషించిన పాత్రను రక్షణ మంత్రి మెచ్చుకున్నారు. కేవలం 23 నిమిషాల్లోనే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేసిన వాయుసేన సిబ్బందిని ప్రశంసించారు. "శత్రు భూభాగంపై క్షిపణులను ప్రయోగించినప్పుడు భారత పరాక్రమాన్ని, శక్తిని ఈ ప్రపంచం చూసింది" అని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన ఈ పోరాటాన్ని ఐఏఎఫ్ ముందుండి నడిపించింది. ఈ పోరాటంలో శత్రువుపై ఆధిపత్యం చెలాయించి భారీ నష్టాన్ని కలిగించింది.

దేశ సరిహద్దులు దాటకుండానే.. పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతంలోనైనా దాడి చేయగల భారత యుద్ధ విమానాల సామర్థ్యాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. "పాకిస్తాన్లోని ఉగ్ర శిబిరాలను, వైమానిక స్థావరాలను ఐఏఎఫ్ ఎలా ధ్వంసం చేసిందో ప్రపంచమంతా చూసింది. భారత్ యుద్ధ విధానం, సాంకేతికత మారిపోయాయని ఐఏఎఫ్ రుజువు చేసింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలపై నవ భారత్ ఆధారపడలేదని, మేడ్ ఇన్ ఇండియా పరికరాలు సైనిక సంపత్తిలో భాగమనే సందేశాన్ని చాటి చెప్పింది. భారత్‌లో తయారైన ఆయుధాలకు తిరుగులేదు" అని పేర్కొన్నారు.

బ్రహ్మోస్ క్షిపణి శక్తిని పాకిస్థాన్ సైతం అంగీకరించిందని రక్షణ మంత్రి అన్నారు. ఈ మేడిన్ ఇండియా క్షిపణి పాకిస్థాన్ గగనతలపు చీకటిని పగలుగా మార్చిందని చమత్కరించారు. అలాగే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రశంసించారు. డీఆర్‌డీవో రూపొందించిన ఆకాశ్ సహా ఇతర రాడార్ వ్యవస్థలు కీలకపాత్ర పోషించాయని చెప్పారు.

నిన్న శ్రీనగర్‌లోని బాదామీ బాఘ్ కంటోన్మెంట్ ఆర్మీతో, ఈ రోజు భుజ్‌లో వాయుసేనకు చెందిన సైనికులతో ముచ్చటిస్తూ.. భారత దేశ సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని భరోసా వ్యక్తం చేశారు. "రెండు విభాగాలకు చెందిన సైనికుల్లోనూ ఉత్సాహం, దేశభక్తిని నేను చూశాను. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికులు చేసిన సాహసం దేశం మొత్తాన్ని గర్వంతో నింపేసింది" అని అన్నారు. పాకిస్థాన్‌పై 1965, 1971 తోపాటు తాజాగా భారత్ సాధించిన విజయాలకు భుజ్ సాక్షిగా నిలిచిందని రక్షణమంత్రి తెలిపారు. జాతి ప్రయోజనాలను కాపాడాలనే అంచంచలమైన సంకల్పంతో సైనికులు దృఢంగా నిలబడే... దేశభక్తి నిండిన భూమిగా భుజ్‌ను ఆయన వర్ణించారు. వాయుసేనతో పాటు సైన్యం, బీఎస్ఎఫ్‌కు చెందిన సైనికులు మాతృభూమికి అందిస్తున్న సేవలకు కృతజ్ఞత వ్యక్తం చేశారు.

సాయుధ దళాలను అత్యాధునిక ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలు, ఆధునిక మౌలిక సదుపాయాలతో నిరంతరం సన్నద్ధం చేయాలనే ప్రభుత్వం అంకితభావాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మరోసారి స్పష్టం చేశారు. శక్తిమంతమైన దేశం తన సైన్యాన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తుందని, వనరులు, సాంకేతికతతో సహా అన్ని రకాలుగా అవసరమైన మద్దతు అందిస్తుందని తెలిపారు. గతంలో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడేదని, ఇప్పుడు ఆయుధ వ్యవస్థలు, రాడార్ వ్యవస్థలు, క్షిపణి రక్షక వ్యవస్థలు, డ్రోన్లు, కౌంటర్ డ్రోన్లను దేశీయంగా తయారు చేసుకుంటోందన్నారు. "దిగుమతి దారులమన్న ఆలోచన నుంచి ఎగుమతిదారులుగా మనం మారుతున్నాం. ఇది ఆరంభం మాత్రమే" అని చెప్పారు.

ఉగ్రవాదంపై జరుగుతున్న పోరాటంపై భారత్ పౌరులు, ప్రభుత్వం, సాయుధ దళాలు, ఇతర భద్రతా సంస్థలు అర్థం చేసుకొని ఐక్యతను ప్రదర్శించారని, ప్రతి పౌరుడూ సైనికుడిలా వ్యవహరించారని తెలిపారు. సైన్యానికి అడుగడుగునా ప్రజలు, ప్రభుత్వం తోడ్పాటు అందిస్తాయని అన్నారు. "మన దేశ సౌర్వభౌమత్వంపై దాడి చేసేందుకు ఎవరూ సాహసించలేని విధంగా, మనమంతా కలసి ఈ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా నాశనం చేద్దాం" అని అన్నారు.

పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన పౌరులకు, ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళులు అర్పిస్తూ రక్షణమంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. గాయపడిన సైనికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వాయుసేన ప్రధానాధికారి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, ఇతర ఐఏఎఫ్ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దుబాయ్‌లో ఐఐఎఫ్‌టీ తొలి విదేశీ కార్యాలయం

న్యూఢిల్లీ, మే 19:భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖలో భాగంగా ఉన్న సంస్థ, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయిన ఇండియన్ ఫారిన్ ట్రేడ్ ఇనిస్టిట్యూట్ (ఐఐఎఫ్‌టీ) విదేశాల్లో తన తొలి ప్రాంగణాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ప్రపంచంలో ఐఐఎఫ్‌టీ ఉనికిని విస్తరించే దిశగా వేసిన ఓ కీలక అడుగును సూచిస్తోంది. అంతేకాదు, అంతర్జాతీయ వ్యాపార విద్యా రంగంలో సైతం భారత్ భాగస్వామ్యం బలోపేతం కానుంది.

విదేశీ వ్యవహారాల శాఖ, హోం మంత్రిత్వ శాఖ, యూనివర్సిటీ గ్రాంట్ల సంఘం (యూజీసీ).. ఇవి నిరభ్యంతర ధ్రువపత్రాలను మంజూరు చేయడం, విద్యా మంత్రిత్వ శాఖ ఆమోదాన్ని తెలపడంతో ఈ చరిత్రాత్మక పరిణామం ఆవిష్కారమైంది. ఇది భారతదేశ ఉన్నత విద్య ప్రపంచీకరణ ప్రక్రియలో ఓ గౌరవాన్విత ఘట్టాన్ని సూచించడం ఒక్కటే కాకుండా, భారతీయ సంస్థలను అంతర్జాతీయీకరించాలని, ప్రపంచంలో అధ్యయనం ద్వారా ప్రాప్తించే జ్ఞాన కూడళ్లను (లెర్నింగ్ హబ్స్) నెలకొల్పాలంటున్న జాతీయ విద్య విధానం (ఎన్ఈపీ) 2020 దార్శనికతకు అనుగుణంగా కూడా ఉంది.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యసాధనపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఐఐఎఫ్‌టీని అభినందించారు. మంత్రి మాట్లాడుతూ, "ఇది జాతీయ విద్యావిధానం-2020 స్ఫూర్తికి అద్దం పడుతోంది. భారతీయ విద్య అంతర్జాతీయ స్థాయికి చేరుకొంటూ ఉండటంలో ఓ కొత్త అధ్యాయం మొదలవనుంది. ప్రపంచం అంతటా నాయకత్వాన్ని పెంచి పోషించడంలో భారతీయ విద్యా రంగం పాత్ర నానాటికీ పెరుగుతోందనడానికి ఇది ఒక నిదర్శనం. భారత్-యూఏఈ భాగస్వామ్యం దృఢతరం అవుతోందనడానికి కూడా ఇది ఒక ప్రమాణం. ఈ కొత్త క్యాంపస్ భావితరం వాణిజ్య ప్రముఖులను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్రను పోషిస్తుంది" అన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో విస్తరణకు చొరవ తీసుకుంటున్నందుకు వాణిజ్య శాఖ కార్యదర్శి శ్రీ సునీల్ బర్త్‌వాల్ ఐఐఎఫ్‌టీని అభినందించారు. దుబాయ్‌లో ఒక పూర్తి స్థాయి ప్రాంగణాన్ని ఐఐఎఫ్‌టీ ఏర్పాటు చేయనుండడం 62 సంవత్సరాల ఐఐఎఫ్‌టీ చరిత్రలోనే ఒక మేలిమలుపంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రపంచ శ్రేణి విద్యను అందించడంలో, ముఖ్యంగా అంతర్జాతీయ వ్యాపార రంగంలో అడుగు పెడుతున్న దేశంగా భారత్ ఎదుగుదలను ప్రకటిస్తోంది అని ఆయన అభివర్ణించారు. ఈ సంస్థ దేశ హితాన్ని దృష్టిలో పెట్టుకొంటూ తన విద్యాసంబంధ ప్రయత్నాలకు, పరిశోధన సంబంధ ప్రయత్నాలకు అదేపనిగా మెరుగులు పెట్టుకొంటోందని, దీంతో ఎగుమతులకు గొప్ప ప్రోత్సాహం దక్కనుందని శ్రీ సునీల్ ప్రశంసించారు.

ఐఐఎఫ్‌టీ ప్రపంచ స్థాయి సంస్థగా మార్చడంతో పాటు, కొత్తగా ఏర్పాటు చేయబోయే దుబాయ్ క్యాంపస్ ద్వారా అంతర్జాతీయ వ్యాపార రంగంలో పరిశోధన, శిక్షణ విభాగాల్లో రాణించాలి.. ఇందుకోసం నేను కట్టుబడి ఉన్నాను అని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాకేశ్ మోహన్ జోషీ పునరుద్ఘాటించారు. ఐఐఎఫ్‌టీ దుబాయ్ ప్రాంగణం ప్రతిపాదన కార్యరూపాన్ని దాల్చడంలో నిరంతర మద్దతును తెలుపుతూ వచ్చిన వాణిజ్య శాఖకు, విద్యాశాఖకు, హోం శాఖకు, విదేశీ వ్యవహారాల శాఖకు, యూఏఈలో భారతీయ దౌత్య కార్యాలయానికి, యూజీసీతో పాటు ఇతరులందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్య, పరిశోధన.. ఈ రెండు రంగాల్లో శ్రేష్ఠత్వాన్ని సాధిస్తూ విద్య, ఆర్థిక దౌత్యం రంగాల్లో భారత్ దూసుకుపోయేటట్లు ఐఐఎఫ్‌టీ కృతనిశ్చయాన్ని కనబరుస్తుందని కూడా ఆయన ప్రధానంగా చెప్పారు.

త్వరలో ఏర్పాటు కాబోయే దుబాయ్ ప్రాంగణం యూఏఈతో భారత్ విద్యారంగ సహకారం గాఢతరం అవుతూ ఉండడాన్ని ప్రతిబింబిస్తోంది. భారతీయ విలువలను, అంతర్జాతీయ దృక్పథాన్ని కలబోసుకొనే ప్రపంచ వాణిజ్య నేతలను తీర్చిదిద్దడంలో కూడా ఈ క్యాంపస్ ఒక వ్యూహాత్మక కేంద్రంగా నిలవబోతోంది. ఇది మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న భారత ప్రవాసి సముదాయం అవసరాలను, ప్రపంచంలోని వివిధ దేశాల విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చడంతోపాటు గల్ఫ్ ప్రాంతంలో భారత విద్య పాదముద్రను విస్తరించనుంది కూడా.

దుబాయ్‌లో క్యాంపసును మొదలుపెట్టడంతో, భారతీయ విద్య వారసత్వాన్ని కొత్త సీమలకు తీసుకుపోవడానికి ఐఐఎఫ్‌టీ నడుం కట్టింది. రాబోయే కాలంలో అంతర్జాతీయ వ్యాపారం, వాణిజ్యాల రూపురేఖలను తీర్చిదిద్దే నాయకులకు ఇకపై ఐఐఎఫ్‌టీ శిక్షణనివ్వనుంది.

# జాతీయతా స్ఫూర్తిని ప్రేరేపించేలా ఒకే దేశం, ఒకే హృదయ స్పందన

న్యూఢిల్లీ, మే 19:మొక్కవోని దేశభక్తిని ప్రదర్శించిన స్ఫూర్తిని కీర్తిస్తూ, భారత వీరుల గౌరవార్థం.. 'ఏక్ దేశ్ ఏక్ దడ్కన్' (ఒకే దేశం, ఒకే హృదయ స్పందన) అనే శక్తిమంతమైన, బాధ్యతాయుతమైన కార్యక్రమాన్ని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రారంభించింది.

దేశ ప్రతిష్ఠను ముక్తకంఠంతో చాటుతూ అందరినీ ఏకం చేయడం కోసం రూపొందించిన ఈ కార్యక్రమ స్ఫూర్తి ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రజల హృదయాల్లో బలంగా ప్రతిధ్వనిస్తోంది. ఐక్యతా స్ఫూర్తిని, దేశభక్తి భావనను, మువ్వన్నెల జెండాపై గౌరవాన్ని పెంపొందించే విధంగా అనే నినాదం డిజిటల్ వేదికల్లో విశేష ప్రాచుర్యాన్ని పొందుతోంది.

మన విస్మృత వీరులు, పరాక్రమశీలుర ధైర్యసాహసాలకు ప్రణమిల్లుతూ.. దేశం వారిపట్ల కృతజ్ఞతతో ఉందన్న సమష్టి భావనను ఇది ప్రతిబింబిస్తుంది.

సమన్వయంతో కూడిన జాతీయ భాగస్వామ్యం

గత 48 గంటల్లో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 43 సంస్థలు కలిసికట్టుగా, ఉత్సాహంగా పాల్గొన్నాయి.

మనల్ని కలిపి ఉంచే మువ్వన్నెలతోపాటు సాయుధ బలగాలు, వీరులకు వందనం చేస్తూ.. ఆ సంస్థలన్నీ తమ ముఖచిత్రాలను (డీపీ) మూడురంగులతో మార్చి ఈ కార్యక్రమంలో తమ భాగస్వామ్యాన్ని వ్యక్తీకరించాయి.

జెండా రంగుల్లో వెలుగులీనిన ఏఎస్ఐ ఆధ్వర్యంలోని స్మారక కట్టడాలు

ప్రముఖ సాంస్కృతిక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలు భారతీయ జెండా రంగుల్లో మురిసిపోయాయి:

విక్టోరియా మెమోరియల్ (పశ్చిమ బెంగాల్), సాలార్జంగ్ మ్యూజియం (ఆంధ్రప్రదేశ్), ఎన్‌జీఎంఏ- ఢిల్లీ, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, లక్నో.

భారత జాతీయ ప్రాచీన పత్ర భాండాగారం కూడా అద్భుతమైన తన భవనానికి వెలుగులు దిద్దుతూ కార్యక్రమంలో భాగమైంది.

భారత పురావస్తు సర్వే సంస్థ (ఏఎస్ఐ) పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా 60కి పైగా వారసత్వ కట్టడాలు మూడు రంగులతో మెరిసిపోయాయి. వాటిలో కొన్ని:

ఢిల్లీలోని ఎర్రకోట, ఖిలా రాయ్ పిథోరా, సఫ్దర్‌జంగ్ సమాధి, పురానా ఖిలా.

రాజస్థాన్‌లోని కుంభాల్‌ఘర్, చిత్తోర్‌ఘర్, ఘంటా కోట. ఉత్తరప్రదేశ్‌లోని గులాబ్ బాదీ.

ఉదయగిరి గుహలు (ఒడిశా), అశోక స్తంభం (బీహార్), రహత్‌ఘర్ కోట (మధ్యప్రదేశ్), బల్లార్‌పూర్ కోట (మహారాష్ట్ర), తదితర కట్టడాలు.

అస్సాంలోని రంగ్ ఘర్, కర్ణాటలోని చిత్రదుర్గ కోట, లేహ్ ప్యాలెస్.

ఐక్యతను ప్రతిబింబించేలా, కృతజ్ఞతను చాటేలా.. సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ మే 14న కుతుబ్ మినార్‌ను సందర్శించారు. అక్కడ ప్రత్యేక తిరంగా ప్రదర్శన నిర్వహించారు. మన సాయుధ బలగాలను కీర్తిస్తూ, జాతీయతా స్ఫూర్తిని రగిల్చిన మన విస్మృత వీరులు, పరాక్రమశీలుర ధైర్యసాహసాలకు ప్రణమిల్లుతూ మంత్రి నివాళి అర్పించారు.

సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సంస్థలు ప్రత్యేక కథనాలు, చిత్రలేఖనాలు, ప్రత్యేక ప్రదర్శనలు, సంగీతంతో నివాళి, క్విజ్‌లు, బ్యాడ్జిలు/ రిస్ట్ బ్యాండ్ల పంపిణీ, ప్రజలతో తిరంగా ర్యాలీల వంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. తద్వారా భారతీయులందరికీ గర్వకారణమైన ఈ ఉత్సవాన్ని ప్రజలంతా సమష్టిగా చేసుకునేలా కృషిచేస్తున్నారు.

# పలువురు టిడిపి కార్పొరేటర్లు గైర్హాజర్.. విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా



అమరావతి, మే 19: మహా విశాఖ నగర పాలక సంస్థ ఉపమేయరు ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన నేడు నిర్వహించిన సమావేశంలో 56 మంది సభ్యులుగాను 54 మంది హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో రేపటి ఈ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఉప మేయర్ పదవి జనసేనకు కేటాయించడంపై పలువురు టిడిపి కార్పొరేటర్లు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ పోస్ట్ టిడిపికే కేటాయించాలంటూ ఆ కార్పొరేటర్లు పట్టు పడుతున్నారు.. దీంతో టిడిపి వారిని బుజ్జగించే పనిలో పడింది..

# ఉద్యోగాలు అందించే స్థాయికి యువత ఎదగాలి : మంత్రి సవిత



అమరావతి, మే 19: కడప నగరంలో నిర్మించే పీ 4 స్టార్టప్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను రాయలసీమ జిల్లాల్లోని యువత సద్వినియోగం చేసుకొని వారి కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత ఆశాభావం వ్యక్తం చేశారు. నేటి యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో ఏర్పాటు కానున్న "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" నిర్మాణానికి జిల్లా ఇంచార్జి మంత్రి సవిత సోమవారం భూమిపూజ చేశారు. రూ.10కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనానికి పి ఫోర్ కింద షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ రూ.4కోట్లు విరాళం అందించింది. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులు రెడ్డి, జేసీ అదితిసింగ్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ఉద్దేశించి మంత్రి సవిత మాట్లాడుతూ? కడపలో నిర్మించబోయే ఈ సెంటర్ ఎంతో అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనుందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్టప్ హబ్ ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జి ప్లస్ 3 అంతస్తులతో, పిఈబి టెక్నాలజీ ఆధారంగా ఈ స్టార్ట్ అప్ కేంద్ర భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఈ సెంటర్ ఉపయోగపడనుందన్నారు. కడప జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే దిశగా ఈ పీ-4 స్టార్ట్ అప్ ఎంట్రప్రెన్యూషిప్ పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా క్షుణ్ణంగా మంత్రికి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి మాట్లాడుతూ? రాయలసీమ ప్రాంత నడిబొడ్డున ఉన్న కడప నగరంలో రూపుదిద్దుకుంటున్న పీ-4 స్టార్ట్ అప్ కడప భవన నిర్మాణం భవిష్యత్తులో యువతకు గొప్ప ఉపాధి వనరుగా మరనుందన్నారు. సాంకేతిక విద్యా నైపుణ్యం ఉన్న ప్రతి విద్యార్థి, యువతకు ఎంతో ఉపయోగకరం అన్నారు. ప్రతి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి ఒక ఎంట్రప్రెన్యూషిప్ ను తీసుకురావాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు నేటి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేయనుం దన్నారు. ఎంట్రప్రెన్యూషిప్ ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు.జేసీ అదితిసింగ్ మాటాడుతూ పారిశ్రామిక ప్రగతికి, యువతలో నూతన ఆవిష్కృత పటిమను, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించబడిన "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" మన జిల్లా యువతకు చేరువలో రూపుదిద్దుకోవడం అదృష్టకరమైన, ఆనందదాయకమైన విషయమన్నారు.

తెదేపాపొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. కడపలో స్టార్ట్ అప్ సెంటర్ ద్వారా స్థానిక యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి ఆలోచనలకు సరికొత్త రూపం కల్పిస్తూ ఎంటర్ప్రెన్యూషిప్ అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సరికొత్త ఆలోచనలకు కడప నగరం వేదిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, పీఆర్, బీసీ సంక్షేమ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మౌంట్ ఎవరెస్టు అధిరోహణలో ఎన్‌సీసీ సాహసయాత్ర బృందం సఫలం..

న్యూఢిల్లీ, మే 19:జాతీయ యువ సేనా దళం (నేషనల్ కేడెట్ కోర్..'ఎన్‌సీసీ') ఒక ముఖ్య విజయాన్ని చేజిక్కించుకొంది... మౌంట్ ఎవరెస్టును అధిరోహించడంలో ఎన్‌సీసీకి చెందిన సాహస బృందం ఆదివారం (మే 18న) సఫలమైంది. ఎవరెస్టు శిఖరం ఎత్తు 8,848 మీటర్లు. ఈ బృందంలో ఎన్‌సీసీ సైనిక విద్యార్థులు పది మంది.. వారిలో బాలురు, బాలికలు చెరో అయిదు మంది చొప్పున సభ్యులుగా ఉన్నారు. వారితోపాటు నలుగురు అధికారులు, ఇద్దరు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, బాలికా కేడెట్ శిక్షకురాలు, మరో పది మంది నాన్-కమిషన్డ్ ఆఫీసర్లు కూడా ఈ యాత్ర బృందం వెంట ఉన్నారు.

దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన, అనుభవం ఎంతమాత్రం లేని బాలురు, బాలికలు ఎంపిక చేసిన కేడెట్లలో ఉన్నారు. వారంతా ఖచ్చితమైన ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, శిక్షణను పొందారు. వారు సన్నాహక చర్యలలో భాగంగా, మౌంట్ అబీ గామిన్ వద్ద ఏర్పాటు చేసిన ఒక పూర్వ అభ్యాస కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. దీని తరువాత 15 మందితో కూడిన అంతిమ బృందాన్ని ఎంపిక చేశారు. వారికి సియాచిన్ బేస్ క్యాంపులో గల సైనిక పర్వతారోహణ సంస్థలో శీతకాల ప్రధాన సాంకేతిక శిక్షణనిచ్చారు. నెలల తరబడి శిక్షణను ఇచ్చిన అనంతరం, పది మంది కేడెట్లను మౌంట్ ఎవరెస్ట్ సాహస యాత్రకు ఎంపిక చేశారు.యువ పర్వతారోహకులతో కూడిన ఈ బృందంలో సభ్యుల సగటు వయస్సు 19 ఏళ్లే. ఇది ఈ బృందాన్ని ఆకర్షణ కేంద్రంగా మార్చేసింది. అంతేకాదు, పర్వతాన్ని ఎక్కేటందుకు అవసరమైన శిక్షణను పొందే క్రమంలో, ఈ యువజనులు తమ దేహదారుఢ్య సంరక్షణ, క్రమశిక్షణల విషయంలో మంచిపేరు తెచ్చుకున్నారు. ఎన్‌సీసీ బృందం శారీరక సన్నద్ధతనూ, మనోబలాన్నీ నేపాల్‌కు చెందిన షెర్పాలు బహుదా ప్రశంసించారు.

సవాళ్లను రువ్వే వాతావరణ ప్రభావాన్నీ, భౌగోళిక పరిస్థితులనూ ఈ సైనిక విద్యార్థులు తమ ధైర్యంతోనూ, ఉత్సాహంతోనూ ఎదురొడ్డి నిలిచి మరీ ప్రపంచంలోకెల్లా అతి ఎత్తయిన పర్వత శిఖరాగ్రానికి చేరుకున్నారు.

# సీబీఐసీ ఆధ్వర్యంలో సందేస్ ఆన్ సైకిల్

న్యూఢిల్లీ, మే 19:జీఎస్టీ అమల్లోకి వచ్చి ఎనిమిదేళ్లు పూర్తి కాబోతున్న నేపథ్యంలో ఫిట్ ఇండియా మూమెంట్ ఆధ్వర్యంలో కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (సీబీఐసీ) 'సండేస్ ఆన్ సైకిల్' పేరుతో దేశవ్యాప్తంగా సైక్లోథాన్ నిర్వహించింది. ఫిట్ ఇండియాను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉద్యమ స్థాయిలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రధాన కార్యక్రమాన్ని నేడు తెల్లవారుజామున న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ స్టేడియంలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా వందకు మించి సీజీఎస్టీ కమిషనరేట్లు కూడా కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

న్యూఢిల్లీలో సైక్లోథాన్‌ను ప్రారంభించి సందర్భంగా సీబీఐసీ సభ్యుడు (జీఎస్టీ) శ్రీ శశాంక్ ప్రియ మాట్లాడుతూ, భారత పన్నుల వ్యవస్థపై జీఎస్టీ విప్లవాత్మకమైన ప్రభావం చూపిందన్నారు. దాదాపు 30 రకాల పరోక్ష పన్నులను ఒకే, పారదర్శక పన్నుగా ఏకీకృతం చేసిన జీఎస్టీ ద్వారా పన్ను నిర్వహణ సులభతరమవడంతోపాటు వ్యాపార సంస్థలకు, పౌరులకు కూడా పన్నును ఆమోదయోగ్యంగా చేసిందన్నారు.

జీఎస్టీ కంపోజిషన్ పథకం, త్రైమాసిక రిటర్నులూ నెలవారీ చెల్లింపుల (క్యూఆర్ఎంపీ) పథకం ద్వారా చిన్న పన్ను చెల్లింపుదారులకు ముఖ్యమైన ప్రయోజనాలు లభిస్తాయని శ్రీ శశాంక్ ప్రియ వివరించారు. ఇది వన్ను వ్యవహారాలను సరళతరం చేయడంతోపాటు సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు.

సీజీఎస్టీ ముంబయి, పూణే జోన్లు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీ సునీల్ శెట్టి, శ్రీ మిలింద్ సోనమ్, శ్రీ జాన్ అబ్రహం వంటి బాలీవుడ్ ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

ఈ సైక్లోథాన్‌లో దేశవ్యాప్తంగా 50,000కు పైగా సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీబీఐసీ సీనియర్ అధికారులుసీజీఎస్టీ ఢిల్లీ జోన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీ రాజేశ్ సోధి, సీబీఐసీ జీఎస్టీ (డీజీజీఎస్టీ) ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ సి.పి. గోయల్, పన్ను చెల్లింపుదారు సేవల డైరెక్టర్ జనరల్ (డీజీటీఎస్) శ్రీ మహేశ్ కుమార్ రుస్తాగి, వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల ప్రతినిధులు, ప్రజలు సైక్లోథాన్‌లో పాల్గొన్నారు.

జీఎస్టీకి సంబంధించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి గల సందేహాలకు సమాధానమివ్వడం కోసం వేదిక వద్ద 'నో ఎబౌట్ జీఎస్టీ' పేరుతో ప్రత్యేక జీఎస్టీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. భాగస్వామ్యం పెరిగి, సమాచారం అందరికీ చేరడం కోసం జీఎస్టీకి సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా బ్రోచర్‌లను పంపిణీ చేశారు. వీటితోపాటు వ్యూహాత్మకంగా వేదిక అంతటా క్యూఆర్ కోడ్‌లతో కూడిన డిజిటల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా జీఎస్టీ సమాచారాన్ని అందించే మెటీరియల్‌ను ప్రజలు నేరుగా తమ మొబైళ్లలో స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అంతేకాకుండా కీలకమైన జీఎస్టీ సంస్కరణలు, పన్ను చెల్లింపుదారులే కేంద్రంగా రూపొందించిన కార్యక్రమలను వివరించే భారీ హోర్డింగ్‌లు, బ్యానర్‌లను ప్రధానంగా ప్రదర్శించారు. వీటిలో ఎంఎస్ఎంఈలకు అందిస్తున్న చేయూత, జీఎస్టీ నమోదు ప్రక్రియ మొదలైన అంశాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రజల భాగస్వామ్యం, అవగాహన ద్వారా జీఎస్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలన్న సీబీఐసీ లక్ష్యానికి అనుగుణంగా.. ఈ కార్యక్రమం సమగ్రమైన, ఆకర్షణీయమైన వాతావరణాన్ని ఏర్పరిచింది.

ప్రజారోగ్యంపై అవగాహననూ పన్ను చెల్లింపుదారుల భాగస్వామ్యాన్నీ మేళవించే విస్తృతమైన కార్యక్రమంలో ఈ సైక్లోథాన్ భాగం. ప్రజలందరిలోకీ చొచ్చుకెళ్లే వినూత్నమైన కార్యక్రమాల ద్వారా పన్ను చెల్లింపుదారులతోపాట సాధారణ ప్రజలను కూడా భాగస్వాములను చేయడంలో సీబీఐసీ అంకితభావానికి ఇది మరో ఉదాహరణ. ఈ కీలకమైన పన్ను అమలులో ఎనిమిదేళ్ళు విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జాతీయ ఆరోగ్య లక్ష్యాలు, జీఎస్టీ సంస్కరణల ప్రస్థానాన్ని ప్రజలకు చాటేలా దీనిని రూపొందించారు.

# అభివృద్ధి పనులు వేగవంతం అవ్వాలి : మంత్రి టీజీ భరత్



అమరావతి, మే 19: కర్నూలు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. నగరంలోని వివిధ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన చర్చించారు. ఏ కాంట్రాక్టర్ ఏయే పనులు చేపట్టారు, పనుల పురోగతి ఏంటని ఆరా తీశారు. ఇంకా మొదలు పెట్టని పనుల విషయంలో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించి పూర్తికాని వాటి గురించి చర్చించారు. ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారో అడిగి వివరాలు నోట్ చేసుకున్నారు.

తక్కువ ధరకు పనులు దక్కించుకుంటే నాణ్యతతో ఎలా చేస్తారని మంత్రి టీజీ భరత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ప్రజలకు మంచి పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడే ఉద్దేశం లేదన్నారు. తమకు చెడ్డపేరు తీసుకొచ్చేలా పనిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. పనులు ప్రారంభించిన తర్వాత నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ వర్క్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. అందుకు తగ్గట్టే అందరూ పనులు త్వరగా చేయాలన్నారు. ప్రజలకు మంచి పాలన అందించడంలో అందరూ భాగస్వామ్యం అవ్వాలన్నారు.

సమావేశంలో కాంట్రాక్టర్లు మాట్లాడుతూ? కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమలో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బిల్లుల విషయంలో ఆలస్యమవ్వకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఫైల్స్ క్లియరెన్స్ త్వరగా చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యస్. రవీంద్ర బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయండి.. టీజీ భరత్

కర్నూలు బ్యూరో, మే 19, ఆంధ్రప్రభ : నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబుతో కలిసి పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రిలతో పారిశుద్ధ్యంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయని, వాటిపై పర్యవేక్షక సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పునరావృతం అవుతున్న సమస్యలు ఫిర్యాదులు వచ్చేంత వరకు వేచి ఉండకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో పారిశుద్ధ్య మెరుగుపడకపోతే, ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత సిబ్బందే బాధ్యత అని, వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పారిశుద్ధ్యంలో విశాఖపట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మురుగు కాలువలపై ఆక్రమణలు, కాలువలు ఎక్కుతక్కులను సరిచేయించుకునే బాధ్యత పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి చెత్తా సేకరణ వంద శాతం చేపట్టాలని, రహదారులపై, మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేస్తే కలిగే అనర్థాలను ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఇంచార్జ్ యస్ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక సర్వేయర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు నౌకాదళ కేంద్రాన్ని సందర్శించిన రక్షణ శాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ, మే 19:రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ మే 16, 17 తేదీల్లో విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండును సందర్శించారు.

రక్షణ కార్యదర్శి తన పర్యటనలో భాగంగా, తూర్పు నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్‌తో సమావేశమయ్యారు.

కమాండ్ యుద్ధ నిర్వహణ సామర్థ్యాలను, కీలక కార్యకలాపాల గురించి ఈ సందర్భంగా రక్షణ కార్యదర్శికి వివరించారు. తూర్పు సముద్రతీర ప్రాంతంలో ప్రస్తుతం పనులు పురోగమిస్తూ ఉన్న మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు, త్వరలోనే చేపట్టవలసి ఉన్న ప్రాజెక్టులను గురించి కూడా విస్తృతంగా ఆయనకు తెలిపారు. ఈ ప్రాజెక్టులను నౌకాదళ యుద్ధ నిర్వహణ- వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించే ఉద్దేశంతో అమలు చేయాలని తలపెట్టారు.

# ప్రెస్ క్లబ్‌లో ఐఎన్టీయూసీ నాయకుల ఫైటింగ్



హైదరాబాద్, మే 19:హైదరాబాద్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంఘాల నాయకుల మధ్య గొడవ జరిగింది.

ఐఎన్టీయూసీ(ఆర్) అంబటి కృష్ణమూర్తి వర్గీయులపై ఐఎన్టీయూసీ సంజీవరెడ్డి వర్గీయులు దాడికి దిగారు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్టీయూసీ(ఆర్) నేషనల్ ప్రెసిడెంట్ అంబటి కృష్ణమూర్తి ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న ఐఎన్టీయూసీ నేత సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్, ఇతర వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అంబటి వర్గీయులు సైతం సంజీవరెడ్డి వర్గీయులపై ఎదురుదాడికి దిగారు.

ఈ క్రమంలో ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. అయితే రంగంలోకి దిగిన అబిడ్స్ పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు. సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంజీవరెడ్డి తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఆరోపించారు. ఆ ఆరోపణలను ఖండించేందుకు ప్రెస్‌మీట్ పెడితే దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఒడిశా సముద్ర తీరంలో 6.98 లక్షలకు పైగా ఆలివ్ రిడ్లే తాబేళ్లను రక్షించిన ఐసీజీ

న్యూఢిల్లీ, మే 19:సముద్ర జీవజాల పరిరక్షణలో భాగంగా చేపట్టిన 'ఆపరేషన్ ఒలీవియా' వార్షిక కార్యక్రమం ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒడిశాలోని రుషికుల్య నదీ ముఖ ద్వారం వద్ద 6.98 లక్షలకు పైగా ఆలివ్ రిడ్లే తాబేళ్లను భారతీయ తీర రక్షక దళం (ఐసీజీ) కాపాడింది. ప్రతి ఏడాది నవంబర్ నుంచి మే వరకు ఆపరేషన్ ఒలీవియాను ఐసీజీ నిర్వహిస్తుంది. గహిర్మాత బీచ్‌తో సహా ఒడిశాలోని ఇతర సముద్ర తీర ప్రాంతాల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు గుడ్లు పెట్టడానికి అనువైన ప్రదేశాలను కల్పించడమే ఈ ఆపరేషన్ ఒలీవియా లక్ష్యం. ఏటా ఇక్కడకి 8 లక్షలకు పైగా తాబేళ్లు వలస వస్తాయి. ఒడిశాలోని రుషికుల్య నదీ ముఖద్వారం వద్ద పెద్ద సంఖ్యలో గుడ్లు పెట్టేందుకు తాబేళ్లు రావడం ఐసీజీ చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనం. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం, ఏరియల్ నిఘా, సామాజిక తోడ్పాటుతో అంతరించిపోతున్న జాతులను పరిరక్షించేందుకు ఐసీజీ కృషి చేస్తోంది.

ఆపరేషన్ ఒలీవియా ప్రారంభించినప్పటి నుంచి 5,387 ఉపరితల గస్తీ, 1,768 వైమానిక గస్తీ కార్యక్రమాలను ఐసీజీ చేపట్టింది. తద్వారా అక్రమంగా చేపలు పట్టడం, తాబేళ్ల ఆవాసాలను నాశనం చేయడం లాంటి ముప్పులు తగ్గాయి. ఈ సమయంలో అక్రమంగా చేపలు పట్టేందుకు వినియోగించిన 366 బోట్లను స్వాధీనం చేసుకుంది. ఇది సముద్ర జీవులను రక్షించడంలో ఐసీజీకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. నిఘాతో పాటుగా స్థానిక మత్స్యకారులను టర్టిల్ ఎక్స్‌క్లూడర్ డివైజ్‌లను ఉపయోగించేలా ఐసీజీ ప్రోత్సహించింది. సుస్థిర చేపల వేట పద్ధతులను అనుసరించేందుకు, జీవ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎన్జీవోలతో అధికారికంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

# దేశ సైనికుల వెంటే మేము.. సంబురంగా తిరంగా యాత్ర




నిజామాబాద్, మే 19:ఆపరేషన్ సింధూర్ లో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశాన్ని కాపాడిన సైనికుల వెంటే.. మేము అంటూ ఇందూర్ ప్రజలు... దేశ ప్రజలందరూ ఒక్కటై సైనికుల వెంట నిలవడటం గర్వంగా ఉందనీ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల ప్రాణాలను తీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులకు మన సైనికులు తగిన గుణపాఠం చెప్పారన్నారు.

"ఆపరేషన్ సింధూర్ విజయం" త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా సిటిజెన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఇందూరు జిల్లా ఆధ్వర్యంలో మేము సైతం దేశం కోసం అనే నినాదంతో సోమవారం సాయంత్రం నిజామాబాద్ నగరంలోని శివాజి చౌక్ ఆర్.ఆర్. చౌరస్తా వద్ద తిరంగా యాత్ర కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, బిజెపి సీనియర్ నాయకులు ఎండల లక్ష్మీనారాయణ, బిజెపి మాజీ ఫ్లవర్ లీడర్ స్రవంతి రెడ్డి, హిందూ సంఘాల అధ్యక్షులు నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భరతమాత వేషధారణలో.. సైనికుల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదేవిధంగా భారీ భరతమాత విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జీఈఎమ్ వేదికను గురించిన ఒక వ్యాసాన్ని పంచుకున్న ప్రధాని

న్యూఢిల్లీ, మే 19:జీఈఎమ్ (ఉ వట) వేదికను గురించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు.

"పారదర్శక పాలనను అందించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు డిజిటల్ మాధ్యమం రూపంలో ప్రోత్సాహం లభించింది. సమాజంలో నిరాదరణకు గురైన వర్గాల వారి కోసం జీఈఎమ్ ఇండియా అవకాశాలను అందిస్తోంది... అధికార స్థాయిలో జరిగే జాప్యానికి స్వస్తి పలుకుతోంది. పెద్ద ఎత్తున పొదుపునకు బాటలు వేస్తోంది" అని శ్రీ మోదీ అన్నారు.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ వ్యాసానికి ప్రధానమంత్రి కార్యాలయం ప్రతిస్పందిస్తూ, ఎక్స్‌లో ఒక సందేశాన్ని పొందుపరుస్తూ అందులో ఇలా పేర్కొంది:

"పారదర్శక పాలనను అందించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు డిజిటల్ మాధ్యమం రూపంలో ప్రోత్సాహం లభించింది. జీఈఎమ్ ఇండియా సమాజంలో నిరాదరణకు గురైన వర్గాల వారి కోసం అవకాశాలను అందిస్తోంది.. జాప్యానికి స్వస్తి చెబుతోంది..ఇది పెద్ద ఎత్తున పొదుపునకు బాట వేస్తోంది.

జీఈఎమ్ వేదిక గురించి వివరాలు తెలియజేస్తూ కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఒక సమగ్ర వ్యాసాన్ని రాశారు."

# ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, మే 19: ప్రతి ఒక్కరూ భక్తి భవాన్ని పెంపొందించుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని మునిమోక్షం గ్రామంలో నూతనంగా నిర్మించిన సంగమేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్టాపనలో మహోత్సవంలో మాజీ మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు మండలంలో దేవాలయాభివృద్ధి కోసం మండపాల నిర్మాణానఇకి నిధులు ఇచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో బఈఆర్ఎస్ మండల అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : ఎస్ఐ రమేశ్

హైదరాబాద్, మే 19:వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కులకచర్ల ఎస్ఐ రమేశ్ అన్నారు. సోమవారం కులకచర్ల పోలీస్టేషన్ దగ్గర రోడ్డుపైన వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు తప్పని సరిగా పాటించాలని సూచించారు.

బైక్ నడిపేవారు హెల్మెట్‌ను ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు. అలాగే కారు నడిపేవారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మధ్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మానవత్వంతో స్పందించండి..

## - నష్టపరిహారం పెంచండి- రేవంత్ కు కేటీఆర్ హితవు

-అగ్ని ప్రమాద బాధితుకులకు అండగా ఉంటాం
-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
-క్షతగాత్రులకు ఓదార్పు.. సంఘటనపై ఆరా
-మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు ఇవ్వాలని డిమాండ్..

హైదరాబాద్, మే 19: చార్మినార్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన వారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



పరామర్శించారు. సోమవారం క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు కేటీఆర్ ముందు కన్నీరు పెట్టుకోగా వారిని ఓదార్చారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తూ.. ఐదు లక్షలు కాకుండా రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలని, అవి వారి ఇంటిని, వ్యాపారాన్ని పున:నిర్మిం చుకోవడానికి ఉపయోగ పడుతాయని అన్నారు.

అంబులెన్స్ లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైర్ ఇంజన్ లో నీళు ఉంటే గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంలో ప్రాణ నష్టం తగ్గేదని అభిప్రాయపడ్డరు. . ఫైర్ బ్రిగేడ్ కు సరైన మాస్కులు లేకపోవడంలో వాళు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారన్నారు.. అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ, ఇలాంటి మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుందని అన్నారు.. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమని పేర్కొన్నారు.

కేటీఆర్ ఇంకా ఏమన్నారంటే ..

-నిన్నటి గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద సంఘటన హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరం. గుల్జార్ హౌస్ గురించి తెలియని వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో ఎవరూ లేరు.

-125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలోని 17 మంది చనిపోవడం మనసున్న ప్రతీ ఒక్కరిని కలిచివేసింది.

- బాధిత కుటుంబసభ్యులు ఎవరినీ నిందించడం లేదు. కాని వారు కొన్ని విషయాలు చెప్పారు.

- ఫైర్ బ్రిగేడు నీళ్లు లేకుండా వచ్చింది. ఫైర్ బ్రిగేడ్ వాళ్లు సరైన మాస్కులు లేకుండా రావడంతో లోపలికి వెళ్లలేకపోయారు. అంబులెన్స్ లలో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడం దారుణం.

- ఈ కనీస సదుపాయలు ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లో ఉంటే కొన్ని ప్రాణాలు బతికేవని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు.

-అగ్నిప్రమాదం జరగగానే స్థానికులైన హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి మమ్మల్ని కాపాడారని చెప్పారు.

-మాకు జరిగిన నష్టం రాబోయే రోజుల్లో ఎవరికీ జరగకూడదని కోరుకుంటున్నారు. భవిష్యత్తులో ఎవరు చనిపోకుండా చూడమని కోరారు.

- నేను రాజకీయం చేయడానికి రాలేదు. ఎవరినీ విమర్శించడం లేదు. కాని ఎండాకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యల మీద రివ్యూ సమావేశం పెట్టుకోవాలి.

-పాతబస్తీ అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రదేశం. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లు రావడానికి కూడా వీలుకాలేదు.

-అధికారులకు నిరంతరం ట్రైనింగ్ ఇవ్వాలి. తరుచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. ఇవేవి జరగలేదు. ఇది మంచిది కాదు. అంబులెన్స్ లు వచ్చినయి కాని అందులో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడంతోనే ఎక్కువ ప్రాణ నష్టం జరిగింది. ఎనిమిది మంది చిన్నారులు తమ కళ్లముందే చనిపోయారని చెపుతున్నారు.

- ప్రాణాలు పోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా చూడండి.

- అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ ఇలాంటి వాటిపై కూడా పెట్టండి. అందాల పోటీలపై పెట్టే ఖర్చు ఇలాంటి సందర్భాల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయలపై పెట్టండి.

- రేవంత్ రెడ్డి దగ్గరనే హోం, మున్సిపల్ శాఖలు ఉన్నాయి. సంఘటన స్థలం దగ్గరికి రేవంత్ రెడ్డి వస్తే బాగుండేది.

-ఐదు లక్షల నష్టపరిహారం సరిపోదు. ఇంటికి, వ్యాపారానికి తీవ్ర నష్టం జరిగింది. 125 సంవత్సరాల నుంచి హైదరాబాద్ లో ఉంటున్న అగర్వాల్ కుటుంబం మళ్లీ తమ వ్యాపారం ప్రారంభించుకోడానికి ప్రభుత్వం సహకరించాలి.

-రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను.

-బీఆర్ఎస్ తరపున కూడా ఆదుకునే ప్రయత్నం చేస్తాము. రాజకీయం చేయడానికి రాలేదు. ఇలాంటి కడుపు కోత ఇంకెవరికి రాకూడదని వచ్చాను.

- ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని కోరుతున్నాను.

# నైపుణ్యానికి కృషి తోడైతే అద్భుతవిజయాలు సాధ్యం: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## - రాబోయే తరాలకు కేజీబీవీ విద్యార్థినులు రోల్ మోడల్ గా నిలవాలి

## - కొణిజెర్ల బస్వాపురం కేజీబీవి పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం, మే 19 (నేటినిజం ప్రతినిధి) : విద్యార్థినులలో ఉన్న నైపుణ్యానికి కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కొణిజెర్ల మండలం బస్వాపురం గ్రామంలోని కేజీబీవి పాఠశాలలో జిల్లాలోని కేజీబీవి విద్యార్థినులకు చేపట్టిన వేసవి శిక్షణా శిబిరంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కెజిబివి విద్యార్థినులచే రూపొందించిన పెయింటింగులు, ఆకర్షణీయమైన కాగితపు బొకేలు, వస్తువులను పరిశీలించి, విద్యార్థినులను అభినందించారు. విద్యార్థినులచే చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ... అసమానతలు తగ్గాలంటే చదువు చాలా ముఖ్యమని, మన తల్లితండ్రులకు, పూర్వీకులకు చదువుకునే అవకాశం లేదని, ప్రస్తుతం మనకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మనం ఎక్కడ పుట్టాం, కులం, మతం, కుటుంబ స్థితిగతులు మన చేతిలో లేవని, మనం ఏం సాధిస్తామనేది మాత్రమే మన చేతిలో ఉందని అన్నారు. మైండ్, బాడీ ఏకీకృతం చేసి కృషి చేస్తేనే విజయం సాధ్యం అవుతుందని, పేదలు పైకి రావాలంటే కేవలం చదువుతో మాత్రమే సాధ్యం అవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థిలో మంచి టాలెంట్ ఉందని, సరైన సమయంలో కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. మొక్కకు సరైన సమయంలో నీరు పోయకుండా ఉంటే ఎలా ఎండిపోతుందో, జీవితం కూడా సరైన సమయంలో కృషి చేయకపోతే వృధా అవుతుందని అన్నారు. జీవితంలో మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎన్ని ఆటంకాలు వచ్చినా పట్టుదలతో సాధించాలని, ఇతరులు అనే మాటలు ఎప్పుడూ పట్టించుకోవద్దని, ఎంతమంది మనల్ని నిరుత్సాహపరిచినా, ఎగతాళి చేసినా కూడా లక్ష్యం వైపు మాత్రం దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్ష పూర్తి స్థాయిలో తొలగించేలా కేజీబీవీ విద్యార్థినులంతా జీవితంలో గొప్ప విజయాలు సాధించాలని, రాబోయే రోజుల్లో ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు మీరంతా రోల్ మోడల్ లాగా ఎదగాలని అన్నారు. అనంతరం విద్యార్థినులు కేజీబీవిలలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. విద్యార్థినులు చెప్పిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ, కెజిబివి జిల్లా కో-ఆర్డినెటర్ తులసి, కెజిబివి ఎస్ఓ, కొనిజర్ల ఇంచార్జ్ తహసీల్దార్ రాము, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి బోనస్‌ను వెంటనే చెల్లించాలి : గుడిశాల వెంకన్న

వరంగల్, మే 19: రైతులకు ధాన్యానికి సంబంధించిన బోనస్‌ను వెంటనే చెల్లించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ వివేక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాతావరణంలో మార్పులు వస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో త్వరితన కొనుగోళ్లు చేపట్టాలన్నారు.

గన్ని సంచులు అందుబాటులో ఉంచాలని, ధాన్యం బస్తాలను త్వరితగతిన మిల్లులకు, గోదాములకు తరలించాలని కోరారు.

వానాకాలం పెట్టుబడి కోసం రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని త్వరగా అందించాలని, రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బొబ్బాల యాకూబ్ రెడ్డి, చాగంటి కిషన్, వెంకటేశ్వర్లు, జయరాజు, జలంధర్, సోమారపు ఎల్లయ్య, సారయ్య, కేసీఆర్ నాయక్ తదితరులున్నారు.

# శ్రీ జో బైడెన్ త్వరగా కోలుకోవాలి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 19:అమెరికా మాజీ అధ్యక్షుడు శ్రీ జో బైడెన్ ఆరోగ్యం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన శీఘ్రంగా, సంపూర్ణంగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. "డాక్టర్ జిల్ బైడెన్‌తో పాటు కుటుంబ సభ్యుల వేదనలో నేను పాలుపంచుకుం టున్నాను" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రధాని ఎక్స్‌లో ఒక సందేశాన్ని పొందుపరుస్తూ "జో బైడెన్ (ఏఏనీవఃతిటవని) గారి ఆరోగ్యం విషమించిందని తెలిసి, నేను చాలా బాధ పడ్డాను. ఆయన త్వరగా, పూర్తి స్థాయిలో కోలుకోవాలి.

# అందాల పోటీలకు రూ.300 కోట్లు .. పుష్కరాలకు రూ.35 కోట్లా .. రేవంత్ ను నిలదీసిన బండి సంజయ్



కాళేశ్వరం , మే 19: సరస్వతి పుష్కరాల సందర్భంగా గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా సరస్వతి కలయికతో ప్రఖ్యాతిగాంచిన త్రివేణి సంగమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేడు పుణ్యస్నానం చేశారు. అనంతరం ముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాల స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పుష్కర పండగకు విడుదల చేసిన 35 కోట్ల రూపాయలు ఏర్పాట్లకు సరిపోవన్నారు.

యూపీ రాష్ట్రంలో కుంభమేళా కు 50 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం సరిపడ నిధులు విడుదల చేసి ఘనంగా నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పుష్కరాలను కుంభమేళ తరహాలో కోట్లాది మందిని తరలించి ఘనంగా నిర్వహించే వాళ్ళమని చెప్పారు. అందాల పోటీలకు రూ. 300 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడం ఏంటి.. అని ప్రశ్నించారు.

పుష్కరాలను ఈ ప్రాంతానికి పరిమితి చేయడం పద్దతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వచ్చే పుష్కరాలకు ఎక్కువ బడ్జెట్ విడుదల చేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో కాళేశ్వరానికి చెడ్డపేరు వచ్చిందని.. పుష్కరాలతోనైన మంచి పేరు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లు వెచ్చించిన నిధులు విడుదల చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన రూ. 200 కోట్ల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# అసంఘటిత కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : పురుషోత్తం రావు



నల్గొండ, మే 19:: అసంఘటిత రంగ కార్మికులకు అనేక న్యాయ చట్టాలు ఉన్నాయని, వాటిని పటిష్టంగా అమలు పరచడంలో కార్మిక శాఖ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ పి. పురుషోత్తమరావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థలో సోమవారం అసంఘటిత రంగ కార్మికులకు నిర్వహించిన న్యాయ చట్టాల అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు.

అసంఘటిత రంగ కార్మికులకు సరియైన పరిస్థితులు కల్పించాలని, వారి భద్రత, వేతనాలు ఇతర మౌలిక వసతులు అందించాలని తెలిపారు.

కార్మికులకు ఇబ్బంది కలిగిస్తే యజమాన్యాలపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాల ద్వారా హక్కులను కాపాడుకోవాలన్నారు.

ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా లేబర్ అధికారి రాజు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిమ్మల భీమారెడ్డి, కార్మికులు, ఆచారి రవి, మదర్ లెనిన్ పాల్గొన్నారు.

# నల్లగొండ డీఈఓపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం ధర్నా




నల్గొండ, మే 19:అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న నల్లగొండ డీఈఓను విధుల నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రముఖ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా నేతలతో కలిసి డీఈఓ అవినీతి బాగోతం నడిపిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన 10వ తరగతి మూల్యాంకనలో డబ్బులు వసూలు చేసి వేరే జిల్లాలకు చెందిన విద్యార్థులకు మార్కులు ఎక్కువ వేయించినట్లు తెలిపారు. గత నాలుగైదు సంవత్సరాల నుండి ఈ తంతు జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రముఖ టీచర్స్ యూనియన్ సంఘం నేత ఫిర్యాదు ఇచ్చినా ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు.

ఉపాధ్యాయ సంఘ నేత ఒకరు ఐదారేండ్ల నుండి బడికి వెళ్లకుండా దొంగ సంతకాలు పెట్టుకుంటూ డీఈఓతో అంటకాగుతూ ఆఫీసులో ఏ పనైనా తన ద్వారానే అవుతుదని ప్రచారం చేసుకుంటూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నట్లు తెలిపారు. గుండ్రంపల్లి ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డికి తన స్పోజ్ ఈ జిల్లాలలో లేకున్నా హౌస్ పాయింట్స్ ఇప్పించి బదిలీలో గుడ్రంపల్లికి ఇప్పించారు. ఎంపీపీ ఎస్ కటోరిగూడెం పాఠశాలలో 30 మంది విద్యార్థులు కూడా లేరు అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు మరో ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ లో ఉన్నారు. అంటే ఒకరి బదులు మరొకరు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అతడు మాత్రం డీఈఓ ఆఫీస్ లో పైరవీలు చేసుకుంటూ డబ్బులు దండుకుంటున్నట్లు వెల్లడించారు. సదురు ఉపాధ్యాయుడిపై పత్రికల్లో వచ్చినా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే చందంపేట మండలం పోలేపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మహిళ ఎస్జీటీ టీచర్ కోరుకొండ పాఠశాలలో పనిచేసేది. ప్రస్తుతం ఆ స్కూల్‌ను విద్యార్థులు రాక మూసేశారు. సదర్ టీచర్‌ను డిప్యూటేషన్ వేయకుండా గతేడాది నుంచి జీతం ఇవ్వడం జరిగిందన్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో కూడా లక్షల రూపాయలు వసూలు చేస్తే ఫెయిల్ అయిన అభ్యర్థులను పాస్ చేయించడం జరిగిందన్నారు.

కావున వెంటనే విచారణ చేసి డీఈఓను, సదురు ఉపాధ్యాయ సంఘం నేతని సస్పెండ్ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం లక్ష్మీనారాయణ, ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షుడు సైదా నాయక్, మిర్యాలగూడ జిల్లా కన్వీనర్ అల్లంపెల్లి కొండన్న, జిల్లా కో కన్వీనర్ వినోద్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల లింగస్వామి, సూర్య, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సూరన్ గుట్ట రోడ్డు పనులను వెంటనే ప్రారంభించండి.. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, మే 19: హైదరాబాద్ శివారు మహేశ్వరం నియోజకవర్గంలోని సూరన్ గుట్ట ఎల్లమ్మ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ నుంచి రావిర్యాల వరకు వెళ్లే మార్గంలో ఉన్న సూరన్ గుట్ట ఎల్లమ్మ ఆలయ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సూర్యగిరి ఎల్లమ్మను దర్శించుకోవడానికి ప్రతిరోజూ 10 నుంచి 15వేల మంది భక్తులు వస్తున్నారని.. రహదారి సరిగ్గా లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రెండు కోట్ల రూపాయలతో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశామని, రోడ్డు అభివృద్ధికి రూ. 4కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు. అయితే ఆ నిధులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆ రోడ్డు అభివృద్ధికి తగిన ప్రతిపాదనలు చేయాలని మున్సిపల్ అధికారులకు సబితా ఇంద్రారెడ్డి సూచించారు. రోడ్డు పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి, భక్తుల సౌకర్యాలను కల్పించే లక్ష్యంగా చర్యలు చేపట్టాలన్నారు.

# రాష్ట్రానికి 6 కుంకీ ఏనుగులు -21న పవన్ ద్వారా అప్పగింత

తిరుపతి , మే 19:రాష్ట్రం లో పెరుగుతున్న అడవి ఏనుగుల దాడుల సమస్య పరిష్కారానికి ఈ నెల 21 న కర్ణాటక ప్రభుత్వం 6 కుంకీ ఏనుగులను ఇవ్వనున్నది. సరిహద్దు జిల్లాల్లో అడవి ఏనుగులు గ్రామాలపై విరుచుకు పడి ప్రజల ప్రాణాలకు, పంటలకు నష్టం కలిగిస్తున్న విషయం తెలిసిందే. దానిపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గత ఏడాది ఆగష్టు లో కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అడవి ఏనుగులను అదుపు చేసి అడవుల వైపు మల్లించే శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను పంపాలని కోరిన విషయం కూడా విదితమే.

అందుకు సానుకూలంగా ప్రతిస్పందించిన కర్ణాటక ప్రభుత్వం ఈనెల 21న రాష్ట్రానికి 6 కుంకీ ఏనుగులు అందజేయడానికి ఏర్పాట్లు చేసింది. ఆ రోజు బెంగళూరులోని విధానసౌధ వద్ద కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్ లు పవన్ కళ్యాణ్ సమక్షంలో కుంకీ ఏనుగులను అందచేయనున్నారు. కార్యక్రమం జరగనున్నది. తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా సరిహద్దు ల్లోని పంటపొలాలను నాశనం చేస్తున్న అడవి ఏనుగులను అదుపుచేసేందుకు ఈ కుంకీ ఏనుగులను వాడనున్నారు

# మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడలిస్ట్.. ఇప్పుడు రొమేనియా దేశాధ్యక్షుడు

న్యూఢిల్లీ, మే 19: రొమేనియా కొత్త దేశాధ్యక్షుడిగా నికోసర్ డాన్(ఔతిఇ-బిబనీతీ ఆజీని) ఎన్నికయ్యారు. ఆ దేశ రాజధాని బుచారెస్ట్ మేయర్‌గా ఆయన చేశారు. రైట్ వింగ్ జాతీయవాది జార్జ్ సిమిన్ నుంచి ఆయన గట్టి పోటీ ఎదుర్కొన్నారు. యురోపియన్ యూనియన్‌కు అనుకూల వ్యక్తి. ఉక్రెయిన్‌కు కూడా ఆయన సపోర్ట్ ఇస్తున్నారు. స్వయంగా ఆయనో గణిత మేధావి. దేశంలో అవినీతి, వ్యవస్థీకృత నేరాలను అంతం చేయాలన్న ఉద్దేశంతో ఉన్నారు. తాజాగా ముగిసిన దేశాధ్యక్ష ఎన్నికల్లో నికోసర్ డాన్‌కు 53.6 శాతం ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ ఎన్నికల్లో సిమిన్ ఫెవరేట్‌గా భావించారు. కానీ ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయన సర్‌ప్రైజ్ ఇచ్చారు. రొమేనియాలో కొత్త అధ్యాయం మొదలైందని, ప్రతి ఒక్కరు దాంట్లో భాగస్వామ్యులు కావాలని డాన్ తన విజయ ప్రసంగంలో పేర్కొన్నారు. వివిధ ప్రజా పాలసీల్లో నిపుణులు భాగస్వామ్యం కావాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రొమేనియాను పునర్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

న్యూఢిల్లీ, మే 19:1969లో ఫగారస్ అనే పట్టణంలో నికోసర్ డాన్ జన్మించారు. చిన్నప్పటి నుంచి గణితశాస్త్రం అంటే ఆయనకు ఇష్టం. స్కూల్, అకాడమిక్స్‌లో ఉత్తమ శ్రేణి సాధించేవారు. 1980 దశకంలో అతను అంతర్జాతీయ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు గెలిచారు. 1998లో పారిస్‌లోని ప్రతిష్టాత్మక సోర్బోర్న్ యూనివర్సిటీ నుంచి మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో డాక్టరేట్ పొందారు. పారిస్ వర్సిటీలో రొమేనియా విద్యార్థులతో దేశం గురించి చర్చించేవాళ్లమన్నారు. రొమేనియా అకాడమీలో గణితశాస్త్ర పరిశోధకుడిగా పనిచేశారు. సేవ్ బుచారెస్ట్ అసోసియేషన్‌తో ఆయన పౌరకార్యకర్తగా మారారు. హరిత ప్రదేశాల్లో అక్రమంగా నిర్మించే రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను ఆయన వ్యతిరేకించారు. గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. అవినీతి వ్యతిరేక పోరాటం కూడా చేశారు. సేవ్ రొమేనియా యూనియన్ పార్టీని స్థాపించారు. 2020లో బుచారెస్ట్ మేయర్ అయ్యారు.

# జాతీయ రక్షణ నిధికి రిటైర్డ్ టీచర్ రూ.లక్ష విరాళం



మహబూబ్‌నగర్, మే 19: జిల్లాలోని ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు భారత రక్షణ నిధికి రూ. లక్ష విరాళాన్ని అందజేశాడు. వడ్డేపల్లి మండలం కోయిల దిన్నె గ్రామానికి చెందిన గోరంట్ల లక్ష్మీకాంతా రెడ్డిఅనే రైతు,విశ్రాంత ఉపాధ్యాయుడిగా సమాజ సేవలో పాల్గొంటున్నారు. రైతు భరోసా పథకం కింద తన బ్యాంకు ఖాతాలో జమైన రూ. లక్షను సోమవారం ఐడీఓసీ సమావేశం హాల్‌లో జాతీయ రక్షణ నిధి కింద కలెక్టర్ బీఎం సంతోష్‌కు అందజేశారు.దేశ రక్షణ కోసం నిరంతరం సాహసంగా సేవలందిస్తున్న భారత సాయుధ దళాలను అహర్నిశలు కృషి చేస్తున్నారని దాత అన్నారు. లక్ష్మీకాంతారెడ్డి సేవా స్ఫూర్తిని అందరికీ ప్రేరణగా నిలవాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు.

# సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం : తుమ్మల వీరారెడ్డి



నల్గొండ, మే 19: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన త్యాగదనుడని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ ప్రాంతంలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య అగ్ర భాగాన ఉండి సాయుధ పోరాటాన్ని నడిపారన్నారు.వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య ప్రజల కోసం తనకు వారసత్వంగా వచ్చిన వందలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి ఇచ్చి, జీవితాంతం నిరాడంబర జీవితాన్ని గడిపారని కొనియాడారు. 1934 వ సంవత్సరంలో తన సొంత గ్రామం నెల్లూరు జిల్లా కొవ్వూరు తాలూకా అలగానిపాడు లో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి,వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని నడిపిన మహా యోధుడు సుందరయ్య అని కొనియాడారు. పార్లమెంటుకు, శాసనసభకు సైకిల్‌పై వెళ్లేవారన్నారు. సమాజమే తన పిల్లలు అనుకుని తాను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు.

నేడు ఎంతోమంది రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం పనిచేస్తున్నారని, విలువలను మరిచి అక్రమ సంపాదనకు, పదవి వ్యామోహంతో డబ్బు కోసం పార్టీలు మార్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. నేటి యువత సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధన కోసం కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీ హెచ్ లక్ష్మీనారాయణ, ఎండీ.సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నలపరాజు సైదులు, ఆకారపు నరేశ్, పోలే సత్యనారాయణ, బి.పరిపూర్ణ చారి, భూతం అరుణకుమారి, రవీ, నరసింహ పాల్గొన్నారు.

# అధికార పార్టీ ఎమ్మెల్యేపై కర్రె వెంకటయ్య పోరాటం హర్షనీయం : మాజీ మంత్రి హరీశ్ రావు



యాదగిరిగుట్ట, మే 13 : అధికార పార్టీ ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య చేస్తున్న పోరాటం హర్షనీయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కర్రె వెంకటయ్యకు జిల్లా బీఆర్ఎస్ పార్టీలో కీలక పదవి అప్పగించనున్నట్లు తెలిపారు. ఎన్డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని నివాసంలో హరీశ్‌రావును కర్రె వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలేరు నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యేపై కర్రె వెంకటయ్య చేస్తున్న పోరాటం హర్షనీయమని కితాబునిచ్చారు. రైతులు, సబ్బండ కులాలకు ఇచ్చిన 420 హామీలను మరిచి సుందరీమణుల పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టడం సరైంది కాదన్నారు.

పదేళ్ల కాలంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఖజానా నుంచి ఒక్కపైసా ఖర్చు చేయలేదన్నారు. ప్రభుత్వ నిధులతోనే ఆలయాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. 17 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. పార్టీ శ్రేణులు ప్రచారంలో ముందుండాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడొద్దని ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. పార్టీకోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ తోటకూర చీరయ్య, మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, బీఆర్ఎస్ బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడే మహేందర్, నాయకులు గుణగంటి బాబురావుగౌడ్, శివ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పుస్తకాల విక్రయాలకు దరఖాస్తుల ఆహ్వానం : విద్యాశాఖాధికారి రాధాకిషన్

మెదక్, మే 19:: ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను దుకాణాల ద్వారా విక్రయించడానికి జిల్లాలోని పట్టణ, మండల పరిధిలలోని విక్రయదారులు అవసరమైన ఇండెట్‌ల కోసం ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు.

గతంలో అనుమతి పొందిన విక్రయదారులు జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ప్రొసీడింగ్‌తో పాటు రూ.వెయ్యి జిల్లా విద్యాశాఖాధికారి మెదక్ పేరిట డీడీని జత చేయాలని సూచించారు. గత సంవత్సరం ఇచ్చిన పాఠ్యపుస్తకాల్లో మిగిలిన వాటి జాబితాను తరగతుల వారీగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

అనుమతి పొందాలనుకునే వారు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ కార్మికశాఖాధికారి అనుమతి పత్రాలతో గత సంవత్సరం అమ్మకాల టర్నోవర్ చెల్లించిన అమ్మకం పన్ను రసీదు సైతం జతపరచాలన్నారు. ఇట్టి పత్రాలన్ని 2025-26 సంవత్సరాలకు చెల్లింపు రసీదు కలిగి ఉండాలన్నారు.

# పెద్దవంగర కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహణ



మహబూబాబాద్, మే 19::(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలోని సాయి గార్డెన్లో జరిగిన పెద్దవంగర మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజక ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి, జిల్లా పరిశీలకులు రవళి రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిస్వార్థంగా ప్రజల కోసం పని చేస్తోంది. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి శక్తిమేరకు కృషి చేయాలి. కొత్త ప్రాతినిధ్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సంస్థాగతంగా పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలి. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా ముందుకు వెళ్లాలి అని అన్నారు. మహబూబాబాద్ జిల్లా పరిశీలకులు రవళి రెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలంలో తగిన సమన్వయంతో సమీకృతంగా పని చేయడం ద్వారా పార్టీని తిరిగి బలోపేతం చేయవచ్చు. యువతకు ప్రాధాన్యం ఇస్తూనే అనుభవజ్ఞుల సహకారం తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం ఉన్నందున వచ్చే ఎన్నికల్లో విజయం సాధించగలరని విశ్వాసం ఉంది అని చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, యువనాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం పార్టీని బలోపేతం చేసే కార్యాచరణపై చర్చించారు.

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, మే 19:నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరమొచ్చినా అన్ని వేళలా అందుబాటులో ఉంటానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 6.10 లక్షల రూపాయల విలువై చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యల కారణంగా అనేకమంది మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారన్నారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరమన్నారు.

అత్యవసర వైద్యం అవసరమైన వారికి కూడా ఎల్ఓసీల ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు వివరించారు. అదేవిధంగా ప్రజలకు లబ్ధిచేకూర్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిత్యం ప్రజల మధ్యలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన అనేక సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాయకులు అశోక్ యాదవ్, శ్రీహరి, కిషోర్, కూతురు నర్సింహ, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, ఆరీఫ్,బలరాం, ఉత్తమ్ కుమార్ సింగ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థుల డీబార్

నల్గొండ, మే 19: మహాత్మాగాంధీ యూనివర్సిటీ నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను అధికారులు డీబార్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,461 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,132 మంది హాజరయ్యారు. 236 మంది గైరాజరయ్యారు.

ఈ పరీక్షల్లో సూర్యాపేటలోని ఆర్కే ఎల్కే డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్ కు పాల్పడుతూ డీబార్ అయినట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 990 మంది హాజరు కావాల్సి ఉండగా 91 మంది హాజరయ్యారు. 89 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను పట్టిష్టంగా నిర్వహించాలని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్‌స్‌కు సూచించారు. ఎక్కడైనా తప్పు జరిగితే ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బాధ్యులవుతారని తెలిపారు.

# తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలి

## –తెలంగాణ పరిరక్షణ వేదిక

హైదరాబాద్, మే 19:ప్రభుత్వం వెంటనే తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలి.



తెలంగాణ సినిమాను ప్రోత్సహించేలా ఆ పాలసీ ఉండాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణ సినిమా రంగం: అభివృద్ధి–అవరోధాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

పసునూరి రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మావేశంలో సినిమా రంగానికి సంబంధించిన ప్రముఖ దర్శకులు, రచయితలు, ప్రజా ఇనుముల ప్రేమారాజ్, సయ్యద్ రఫీ, ప్రవీన్ చందర్, అశోక్ కుమార్, చల్లా శ్రీనివాస్, అక్షర కుమార్, రమేష్ కిషన్ గౌడ్, తెలంగాణ సినిమా వేదిక గౌరవ సలహాదారులు ప్రఫుల్ రామ్ రెడ్డి, కన్వీనర్ బైరాగి మోహన్ తదితరులు హాజరై ప్రసంగించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్నా నేటికీ తెలంగాణ సినిమా రంగం తీవ్ర వివక్షతకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమా నిర్మాణానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించాలి. తెలంగాణ సినిమాకు పన్ను మినహాయింపులు ఇవ్వాలి. ప్రత్యామ్నాయ సినీ పరిశ్రమను ఏర్పాటు చేసుకునేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఎన్నికల హామీలను అమలు చేయాలి : బొల్గూరి నరసింహ

నల్గొండ, మే 19:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బోల్గూరి నరసింహ అన్నారు. మాదగోని నరసింహ అధ్యక్షతన సీపీఐ రత్తిపల్లి గ్రామ శాఖ మహాసభ సోమవారం జరిగింది. ఈ సభకు బోల్గూరి నరసింహా హాజరై మాట్లాడారు. బ్రాహ్మణ వెల్లంల ఉదయం సముద్రం నుండి పులి పలుపుల చెరువులు నింపాలని, కలవలపల్లి గూడూపురు చెరువు నింపాలని, అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువశక్తి పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన లేకుండా మంజూరు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

సీపీఐ మునుగోడు మండల కార్యదర్శి చాపల శీను మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు రమేశ్, గ్రామ శాఖ కార్యదర్శి మొకాల పరమేశ్, పున్నం యాదయ్య, పగిళ్ల స్వామి, పగిళ్ల శంకరయ్య, బొమ్మగోని స్వామి, బి.యాదయ్య, రాసమల్ల మహేశ్ పాల్గొన్నారు.

# విధుల నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలి : ఎస్ఐ రవి

ఖమ్మం, మే 19:పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది పనిచేసే చోట ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఎస్ఐ బాధావత్ రవి అన్నారు. జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన హెడ్ కానిస్టేబుల్ అజ్మీర బుచ్చయ్య నాయక్, మహిళా కానిస్టేబుళ్లు శైలజ, సౌజన్య బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని స్టేషన్‌లో సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ విన్నర్ జట్టుగా జడ్చర్ల



నాగర్ కర్నూల్, మే 19: నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల టీం విన్నర్‌గా, నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం గుమ్మకొండ టీం రన్నర్ ఆఫ్ గా నిలిచాయి. ఈ టోర్నమెంట్లో జడ్చర్ల విజేత జట్టుకు ఫస్ట్ ప్రైజ్ ట్రోఫీతో పాటు రూ. 50వేల ప్రైజ్‌మనీని అందజేశారు. గుమ్మకొండ టీంకు రన్నర్ ఆఫ్ సెకండ్ ప్రైజ్ ట్రోఫితో పాటు రూ. 25 వేలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగనామోని కిరణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోవటం సహజమని అన్నారు. గ్రామీణ స్థాయిలో మంచి ఫలితాలు సాధించి రాష్ట్ర జాతీయ స్థాయిలో బహుమతులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో రాము నాయక్,రఘు బాబు,అనిల్ గౌడ్, నరేంద్ర గౌడ్, అజీమ్, బాలరాజు , పలువురు ప్రజాప్రతినిధులు , నాయకులు , యువకులు పాల్గొన్నారు.

# సుందరయ్య జీవితం నేటి యువతకు ఆదర్శం : పోతినేని సుదర్శన్‌రావు



ఖమ్మం, మే 19 : మార్క్సిస్ట్ యోధుడు,,దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం, కాచిరాజుగూడెం, గుదిమళ్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నెకల్లు, తల్లంపాడు, ఎం.వెంకటాయపాలెం, అరేంపుల గ్రామాల్లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో పోతినేని మాట్లాడుతూ? ఉన్నత కుటుంబంలో పుట్టి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు సుందరయ్య అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని సుందరయ్య లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని కుల, మత రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ, సీనియర్ నాయకులు మామిండ్ల సంజీవరెడ్డి, సిద్దినేని కోటయ్య, బత్తినేని వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, మండల నాయకులు పి.మోహన్ రావు, పి.సంగయ్య, నందిగామ కృష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు, తోట పెద్ద వెంకట్‌రెడ్డి, వై.ప్రసాద్ రావు, పొన్నం వెంకటరమణ, పల్లె శ్రీనివాసరావు, యామిని ఉపేందర్, పెండ్యాల సుమతీ, వరగాని మోహన్ రావు, కోటి శ్రీనివాన్, పెంట్యాల నాగేశ్వరరావు, అద్దంకి తిరుమలయ్య, పొన్నం మురళి, భాస్కరరావు, మడిపల్లి వెంకన్న, రాజశేఖర్, గాయత్రీ, యండపల్లి వెంకటరామయ్య, సీతారాం రెడ్డి, మద్ది వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# కామ్రేడ్ సుందరయ్య స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

మహబూబ్‌నగర్, మే 19:: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కామ్రేడ్ సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా నాయకులు శంకర్ నాయక్ అన్నారు.

సోమవారం మండలంలోని రాయవరం గ్రామం లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించి సీపీఎం జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో నూతన వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి రైతుకు భూమి లేకుండా , గిట్టుబాటు ధర కల్పించకుండా, మార్కెట్ వ్యవస్థ లేకుండాచేస్తున్నారని మండిపడ్డారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక ఆందోళన పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు స్వామి, కార్మిక సంఘం నాయకులు మల్లయ్య, శరమంద లక్ష్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాలనీలో అక్రమనిర్మాణాలు.. ప్రజావాణిలో స్థానికుల ఫిర్యాదు

మెదక్, మే 19: జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న పలు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వాసులు ఇవాళ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామస్తులు నారబోయిన శ్రీనివాన్, ఎంపీ.బాలయ్యలు మాట్లాడుతూ.. అలీ నగర్ గ్రామం తెలంగాణ కాలనీ సర్వే నెంబర్ 27లో అదేవిధంగా సర్వేనెంబర్ 10 కాలనీల్లో అక్రమ నిర్మాణాలు రాత్రికి రాత్రే జోరుగా సాగుతున్నాయన్నారు.

ప్రభుత్వ, అసైన్మెంట్ భూముల్లో కొందరు రియల్ వ్యాపారులు వెంచర్ల రూపంలో ఫ్లాట్లు నిర్మించి విక్రయిస్తున్నారని అధికారులకు విన్నవించారు. ఈ అక్రమ బాగోతంపై రెవెన్యూ యంత్రాంగానికి పలుమార్లు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా కూల్చివేతలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.

మున్సిపాలిటీలోని ప్రభుత్వ, అసైన్మెంట్ భూములను అక్రమార్కుల నుంచి కాపాడాలని, ఇట్టి భూములను పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్‌లోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి.. కాపరికి తీవ్రగాయాలు

ఖమ్మం, మే 19:డ ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని పాజిమలైగూడెంలో సోమవారం సాయంత్రం పడిన పిడుగుపాటుకు సుమారు 20 గొర్రెలు మృతి చెందాయి. బాచుమల్లయ్యగూడెంకు చెందిన మద్దెల లక్ష్మయ్య తన భార్య లక్ష్మితో కలిసి గొర్రెలను సమీపంలోని అడవికి మేపేందుకు తీసుకువెళ్లాడు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో గొర్రెలను ఇంటికి తోలుకు వస్తుండగా పాటిమీద గుంపు స్మశాన వాటిక సమీపంలో పిడుగుపాటుకు గురై చనిపోయాయి. కాపరి లక్ష్మయ్య అతడి భార్యకు గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.

# టీటీడీకి వైజాగ్ భక్తుడు రూ.20 లక్షలు విరాళం



తిరుపతి , మే 19: టీటీడ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.20 లక్షలు విరాళంఅందింది. వైజాగ్ లోని హిందూస్తాన్ అసోసియేట్స్ కు చెందిన మస్తాన్ రావు ఈ విరాళం అందించారు. ఈ మేరకు దాత విరాళం డీడీని తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో కార్యలయంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు.

తిరుమలశ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదా దేవి రెండు భారీ వెండి అఖండ దీపాలను సోమవారం విరాళంగా అందించారు. ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహా రాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించడం విశేషమని తెలిపారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుందని వివరించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

# ధృవీకరణ పత్రాలు ఉండాలి.. ప్రైవేట్ బస్సు యజమానులకు డీటీవో సూచన



కరీంనగర్, ఏప్రిల్ మే 19: ప్రైవేట్ స్కూల్ బస్సుల యజమానులు అన్ని రకాల వాహన సంబంధిత ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని జిల్లా రవాణాశాఖాధికారి భద్రు నాయక్ అన్నారు. పట్టణంలోని ఆర్టీవో యూనిట్ కార్యాలయంలో సోమవారం కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీం పట్నం, మల్లాపూర్ మండలాల ప్రైవేట్ స్కూల్ యాజమానులతో డీటీవో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్, పర్మిట్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, టాక్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ స్కూల్ బస్సులో హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ పొంది కనీసం ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలన్నారు.

60 ఏళ్లు పైబడిన డ్రైవర్లను నియమించరాదన్నారు. బస్సుల్లో మెడికల్ ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఫైర్ ఎగ్జిట్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. స్కూల్ బస్సులపై యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిబందనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీవో హెచ్చరించారు. ఈ సమావేశంలో కోరుట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు గిరీష్, వజ్ర, రవాణా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రాయప్రోలు సుబ్రహ్మణ్యం గారి స్మారకంగా
(M.A., phd, పురావస్తు, చరిత్ర పరిశోధకులు).

విశాలాక్షి సాహిత్య మాస పత్రికచే
కవితల పోటీ
చివరి తేదీ: 5-6-2025

* అంశం: సామాజిక నేపథ్యం
* 30 పంక్తులు మాత్రమే
* పోస్ట్ /కొరియర్ ద్వారానే పంపాలి
* మెయిల్, వాట్సాప్ లలో స్వీకరించలేము

బహుమతులు: ₹15,000

* మొదటి బహుమతి ₹3 వేలు
* ద్వితీయ బహుమతి ₹2 వేలు
* తృతీయ బహుమతులు 10 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు
* బహుమతులను త్వరలో జరుగు విశాలాక్షి వార్షికోత్సవంలో చిరు సన్మానం మొమెంటోతో సత్కరించబడును

చిరునామా: విశాలాక్షి సాహిత్య మాస పత్రిక, 27-5-487 పద్మావతి నగర్ SVGS కాలేజీ వద్ద, బాలాజీ నగర్ Ext, నెల్లూరు, 524002 Ph: 9440465797

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.